
ఆంధ్రజ్యోతి



బాపట్ల జిల్లా వార్తలు

7

మంగళవారం 14 జనవరి 2025



వైసీపీని వీడనున్న మాజీ ఎమ్మెల్యే రాజశేఖర్

- మరోసారి పరాభవంతో కుమిలిపోతున్న మర్రి
- ఇన్‌చార్జ్ బాధ్యతలతో పాటు అతని భార్యకు సీటిస్తానని మాట ఇచ్చి తప్పిన జగన్
- గుంటూరులో ఓడిన రజనీకి తిరిగి చిలకలూరిపేట పగ్గాలు
- అప్పటి నుంచి రగిలిపోతున్న రాజశేఖర్

8

సరదాల సంక్రాంతి!

- భానుడి ఉత్తరాయాణంతో వెలుగులు పండే సుదినం
- పంట చేతికొచ్చిన వేళ రైతులు చేసుకునే సంబరాలు
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా భోగి వేడుకలు



భోగిమంటలు వేసి వేడుకలు జరుపుకుంటున్న చెరుకుపల్లి మండలం గూడవల్లి-నడింపల్లి గ్రామాల ప్రజలు

గుంటూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రులకు అత్యంత ప్రీతిపాత్రమైన పండుగ మకర సంక్రాంతి. తెలుగునాట ప్రతి ఇంటా ఆ సంక్రాంతి తెచ్చే సంతోషం అంతా ఇంతా కాదు. దేశంలో ఎక్కడున్నా.. ఆ సుదినాన అందరూ సొంత గ్రామాలకు ప్రయాణం కట్టేస్తారు. అవకాశం ఉండాలే కాని విదేశాల్లో ఉన్నవారు సైతం సొంత ఊరి బాట పడతారు. ముచ్చటగా మూడు రోజులు, అదృష్టం కలిసి వస్తే నాలుగు రోజులు కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి సంబరాలు చేసుకుని సంతోషాలను ప్రోది చేసుకుంటారు. ఆ మధురానుభూతులతో తిరుగు ప్రయాణం కడతారు.

ధనుర్మాసంలో సూర్య భగవానుడు దక్షిణాయాణం ఉచ్ఛదశను చేరుతాడు. భోగి పండుగ రోజున దక్షిణాయాణాన్ని పూర్తి చేసుకుని ఉత్తరాయణాన్ని ప్రారంభిస్తాడు. ఆ సమయంలో ప్రతి ఒక్కరూ తమ సామర్థ్యం మేరకు దానధర్మాలు చేస్తే మంచిదని ప్రతీతి. అలా చేయడం వల్ల శుభ ఫలితాలొస్తాయని జనం నమ్ముతుంటారు. కొత్తగా పెళ్లి చేసుకున్న వారు బొమ్మల నోము, సావిత్రి గౌరీ వ్రతం చేస్తారు. మరికొందరు మకర సంక్రాంతి రోజున తమ పూర్వీకుల ఆత్మ శాంతి కోసం తమ సామర్థ్యం మేరకు దానధర్మాలు చేస్తారు.

పురాణాల ప్రకారం 'సంక్రాంతి'

పురాణాల ప్రకారం.. మకర సంక్రాంతి రోజునే భగిరథుడు తన తపస్సుతో ఆకాశంలో ఉండే గంగమ్మను భువిపైకి తీసుకొస్తాడు. తమ పూర్వీకులకు తర్పణం సమర్పించేందుకు భగిరథ మహర్షి గంగమ్మను భువిపైకి ఆహ్వానిస్తాడు. తన ప్రతిపాదనను అంగీకరించి మకర సంక్రాంతి పండుగ రోజున గంగాదేవి భువిపైకి వస్తుంది. గంగాదేవి భూమి పైకి వచ్చిన సుదినమైన రోజు కావడంతో ఆ రోజున మకర సంక్రాంతి పండుగ చేసుకుంటారు. కాబట్టి ఆ పవిత్రమైన రోజున గంగానదిలో లేదా ప్రవహించే నీటిలో స్నానం చేస్తే పుణ్యఫలాలు పొందుతారని పురాణాలు చెబుతున్నాయి. సంక్రాంతి నెలలో హరిదాసుల సందడి చాలా ప్రత్యేకమైనది. హరినామ సంకీర్తనలు పాడుతూ ప్రజలను అలరిస్తూ ఇంటింటికీ తిరిగి మాలదాసరులు సందడి చేస్తారు. పంట చేతికందిన సంతోషంతో రైతులు వారికి తగిన రీతిలో ధాన్యం ఇచ్చి గౌరవించేవారు. సామాన్యులు తమకు తోచిన మొత్తం ఇచ్చేవారు.



బాపట్ల : భావన్నారాయణస్వామి దేవాలయం దగ్గర గంగిరెద్దుల విన్యాసం

మూడో రోజు ముక్క పండగ 'కనుమ'!

మకర సంక్రాంతి పండుగ ముగిసిన మరుసటి రోజున కనుమ పండుగ. ఈరోజున తమ పశువులను అందంగా అలంకరించి, వాటికి ఇష్టమైన దాణా పెడతారు. కనుమ నాడు మాంసాహారం తీసుకుంటారు. కనుమకు ముక్కనుమ కూడా తోడైతే ఆ సంతోషాలకు హద్దులే ఉండవు. అలా నాలుగైదు రోజులపాటు సంక్రాంతి పండుగ సందడి చేస్తుంది. ఏడాదికి సరిపడా సంతోషాన్ని పంచుతుంది. తనివి తీరా ఆస్వాదించి పండగను ముగించుకుని అందరూ మళ్లీ పట్నం బాట పడతారు. సంవత్సరానికి సరిపడేంత సంతోషాన్ని తీసుకెళ్తారు. అందుకే సంక్రాంతిని సరదాల సంక్రాంతిగా చెప్పుకుంటుంటారు.

తీరంలో.. పందేల జోరు



కొల్లూరు మండలం అనంతవరం బరిలో జరుగుతున్న కోడి పందెం

- రూ.లక్షల్లో బెట్టింగ్‌లు
- యథేచ్ఛగా కోతముక్క పేకాట, రమ్మీ, నెంబర్ల జూదం
- భారీ బరుల ఏర్పాటు
- ఇతర రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన పందెం రాయుళ్ళు
- జోరుగా మద్యం అమ్మకాలు
- వీఐపీలకు నాటుకోడి, మటన్ బిర్యానీ
- పందేలను వీక్షించిన మంత్రి అనగాని, జనసేన నాయకులు



కొల్లూరు : పందెం బరి వద్ద జోరుగా సాగుతున్న జూద క్రీడ



చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో పందెం వేసేందుకు కోడి పుంజులతో సిద్ధంగా ఉన్న పందెంరాయుళ్ళు



తూర్పుపాలెంలో నెంబర్లాట ఆడుతున్న పందెంరాయుళ్ళు

తెనాలి, కొల్లూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పందెంకోళ్ళ పౌరుషంతో కత్తులు దూస్తే పేకముక్క జూదప్రియుల చేతుల్లో గుండాట ఆడింది.కోతముక్క లక్షల నోట్లకట్టల కట్లు తెంపింది. తమ జాతకాన్ని పరిక్షించుకునేందుకు ఎంతోమంది అదృష్టాన్ని నెంబర్లాట తారుమారుచేసింది. మద్యం ఏరులైపారింది. సంప్రదాయం మాటున నిషేధాజ్ఞలను కూడా లెక్కచెయ్యకుండా పందెంరాయుళ్ళు విచ్చలవిడిగా పందాలు వేశారు. డెల్టాప్రాంతంలో వారంముందునుంచే కోడిపందేలు కోతముక్క జోరందుకుంటే అనధికార అనుమతులతో సోమవారం నుంచి బహిరంగంగానే కోడిపందేలను కొనసాగించారు. భోగి రోజున భారీస్థాయిలో పందేలు కాయటం, నోట్లను విరజిమ్మటం చూస్తే వాటిని నియంత్రించాల్సిన అధికారులకు ప్రేక్షకపాత్రగానే మిగిలిపోయింది. గుంటూరు,బాపట్ల,పల్నాడుజిల్లాలో కొన్నిచోట్ల మాత్రమే అధికారపార్టీ నేతల కన్నుసన్నల్లోనే బరులు సిద్ధమై కోడిపందేలను వేశారు.

తీరప్రాంతంలో జోరుగా కోడిపందేలు

తీరంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సంప్రదాయాలను అడ్డంపెట్టుకుని అధికారపార్టీ నాయకుల ఆధ్వర్యంలో కోడిపందేలు జోరుగా కొనసాగాయి. పందెం రాయుళ్ళు నాలుగు జిల్లాలతోపాటు తెలంగాణా రాష్ట్రం నుంచి వేలాదిగా తరలి రావటంతో భోగిరోజు మొదటిరోజున లక్షలాది రూపాయలు పందేలు జోరుగా సాగాయి. ఈపందేలను రెవెన్యూశాఖ మంత్రి అనగానిసత్యప్రసాద్, జనసేనపార్టీ జిల్లానాయకులు స్థానిక టీడీపీ నాయకులు పలువురు ప్రముఖులు వీక్షించారు. రేపల్లె నియోజకవర్గంలో చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో, వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం పల్లెకూనలో భారీగా కోడిపందేలు జరిగాయి. దృష్టి సారించాల్సిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తైనా చూసిన దాఖలాలు లేవు. అధికారులపై రాజకీయ నాయకులు తీవ్ర ఒత్తిడి తేవటంతో చేసేదిలేక అధికారులు కూడా చేతులెత్తేశారు. దీంతో పందెం రాయుళ్ళు జోరుగా హద్దుఅదుపులేకుండా పందేలను నిర్వహించారు. ఈరెండుచోట్ల అధికార పార్టీ ప్రధాన నాయకుని ఆధ్వర్యంలో పదిహేను బరులను ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. బరుల సమీపంలోనే హైటెక్ క్లబ్‌ల తరహాగా పేకాట కోసం ప్రత్యేక గుడారాలు వేసి పేకాట, కోతముక్క ఆటలు జోరుగా కొనసాగించారు. లక్షలాది రూపాయలతో వేలాది మంది పందెం రాయుళ్ళు పాల్గొని పందేలను వేశారు. తూర్పుపాలెంలో రూ.10వేలు, రూ.20వేలు, రూ.50వేలు, రూ.లక్ష వరకు ప్రత్యేక బరులను ఏర్పాటు చేసి నిర్వాహకులు పందేలు నిర్వహించారు. వీఐపీ బరుల్లో లక్ష నుంచి రూ.3లక్షల వరకు కోడిపందేలు నిర్వహించారు. గుండాట, నెంబర్లాట విచ్చలవిడిగా కొనసాగించారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి, తెలంగాణా రాష్ట్రం నుంచి వేలాదిగా పందెం రాయుళ్ళు తరలివచ్చారు. పల్లెకూనలో ఆరు బరులు ఏర్పాటు చేసి కోడిపందేలు జోరుగా కొనసాగించారు. బరుల సమీపంలో ఒక్కో బరిలో రెండు స్టాల్స్ ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు భారీగా జరిపారు. విద్యుత్ శాఖాధికారులు నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, విద్యుత్ లైన్లు లాగి భారీ సంఖ్యల్లో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు.

నేడు రూ. 2 లక్షల పందేలు

కొల్లూరు మండల పరిధిలోని అనంతవరం, క్రాప అడ్డ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పందెం బరుల వద్దకు పందెంరాయుళ్ల వందల సంఖ్యలో తమ మేలుజాతి కోడి పుంజులతో పందేలు వేసేందుకు తరలి వచ్చారు. పెద్ద మొత్తంలో కోడి పందేలు వేయడంతో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. రూ.20 వేలు నుంచి రూ.లక్ష వరకు పందేలు జోరుగా సాగాయి. నిర్వాహకులు పందెం రాయుళ్ల కోసం బరుల వద్ద అన్ని ఏర్పాట్లు కల్పించారు. మరోవైపు కోతముక్క, గుండాట, నెంబర్లు ఆట, రాత్రింబవళ్లు పేకాట స్థావరాలను కూడా ఏర్పాటు చేశారు. టీ నుంచి బిర్యానీ వరకు బరి వద్దే పందెం రాయుళ్ల కోసం స్టాల్స్ వెలిశాయి. ద్విచక్ర వాహనానికి రూ.50, కార్లకు రూ.100 పార్కింగ్ రుసుంగా వసూలు చేస్తున్నారు. పందేలు తిలకించేందుకు మహిళలు, యువతులు కూడా ఆసక్తి చూపడంతో సందడి వాతావరణం నెలకొంది.

సంక్రాంతి పర్వదినాన ఒక్కో పందెం రూ.2 లక్షలు

మంగళవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని క్రాప అడ్డరోడ్డు వద్ద నిర్వాహకులు ఒక్కో పందెం రూ.2 లక్షలు చొప్పున 9 పందాలు నిర్వహిస్తున్నట్లు మైకుల్లో ప్రచారం చేశారు. ఎక్కువ పందేలు గెలుపొందిన కోడి యజమానికి ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా ప్రకటించారు.



తూర్పుపాలెంలో బరులవద్దే యథేచ్ఛగా మద్యం సేవిస్తున్న మందుబాబులు



తూర్పుపాలెంలో పార్కింగ్‌లో భారీగా నిలిచిన ద్విచక్రవాహనాలు,కారులు

సాహిత్యరంగానికి లక్ష్మీనారాయణ ఎనలేని సేవ

● మాజీ మంత్రి ఆలపాటి



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సాహిత్య రంగానికి అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ ఎనలేని సేవ చేశారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మట్టి మనిషి మహానాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకోనున్న లక్ష్మీనారాయణను ఘనంగా సన్మానించారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆలపాటి మాట్లాడుతూ పాశ్చాత్య నాగరికత కారణంగా రంగస్థలానికి ప్రాధాన్యం తగ్గుతున్నప్పటికీ ఎంతోమంది అభిమానులు, దాతలు వాటిని ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. నాటకం ప్రదర్శించిన 50 మంది నటీ నటులు, సాంకేతిక నిపుణులను సత్కరించారు. ఈదర వెంకటపూర్ణచంద్, వల్లూరు శివప్రసాద్, బుర్రా సాయిమాధవ్, కనపర్తి బెన్‌హర్, షేక్ జానీబాషా పాల్గొన్నారు.

వైసీపీని వీడనున్న మాజీ ఎమ్మెల్యే రాజశేఖర్

● మరోసారి పరాభవంతో కుమిలిపోతున్న మర్రి
● ఇన్‌చార్జ్ బాధ్యతలతో పాటు అతని భార్యకు సీటిస్తానని మాట ఇచ్చి తప్పిన జగన్
● గుంటూరులో ఓడిన రజినీకి తిరిగి చిలకలూరిపేట పగ్గాలు
● అప్పటి నుంచి రగిలిపోతున్న రాజశేఖర్



గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వరుస పరాభవాలతో కుంగిపోతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ వైసీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. వైసీపీ ఆవిర్భావ సమయంలో జిల్లాలో ఆ పార్టీకి రథ సారథ్యం వహించి ఎంతో అంకితభావంతో పనిచేసినప్పటికీ పార్టీలో నుంచి అతన్ని పంపించేందుకు తొలి నుంచి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. 2004లో ఆయన వైఎస్ రాజశేఖరరెడ్డికి వీరవిధేయుడిగా ఉండి ఆ ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2009 ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ తరుపున పోటీచేసి ఓడిపోయినప్పటికీ నియోజకవర్గాన్నే అంటి పెట్టుకొని పార్టీ పురోభివృద్ధి కోసం పనిచేశారు. అనంతరం వైసీపీ ఆవిర్భావంతో జగన్ వెంట పయనించి జిల్లా పార్టీ పగ్గాలు చేపట్టారు. 2014 ఎన్నికల్లో ఆ పార్టీ తరుపున పోటీ చేసి పరాజయం పాలైనా నియోజకవర్గాన్నే అంటిపెట్టుకొని ఉన్నారు. అయితే 2019లో ఆయనకు చివరి క్షణంలో సీటు నిరాకరిస్తూ కొత్తగా పార్టీలో చేరిన విడదల రజినీకి సీటు ఇచ్చారు.

ఎమ్మెల్సీ.. మంత్రి పదవి ప్రకటించి కూడా..

ఆ ఎన్నికల ప్రచారంలో భాగంగా చిలకలూరిపేట వచ్చిన జగన్ సభలో మాట్లాడుతూ రజినీని గెలిపిస్తే రాజశేఖర్‌కు ఎమ్మెల్సీ పదవితో పాటు మంత్రి పదవిని ఇచ్చి తన కేబినెట్‌లోకి తీసుకుంటానని ప్రకటించాడు. అయితే పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ మంత్రి పదవి అటుంచి రెండేళ్ల పాటు కనీసం ఎమ్మెల్సీ హోదా కూడా కల్పించలేదు. అయితే పుండు మీద కారం చల్లినట్లు రాజశేఖర్‌కు ఇస్తానని చెప్పిన మంత్రి పదవిని రజినీకి ఇచ్చారు. దీంతో అప్పట్లోనే ఆయన అనుయాయులు అతన్ని పార్టీ వీడి టీడీపీలో చేరమని ఒత్తిడి చేశారు. ఈ నేపథ్యంలో మర్రికి ఒట్టి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. తిరిగి 2024 ఎన్నికల సమయానికి రజిని తిరిగి చిలకలూరిపేట నుంచి గెలవదని భావించి గుంటూరు పశ్చిమకు తీసుకొచ్చారు. ఆ సమయంలోనైనా స్థానికంగా పట్టున్న రాజశేఖర్‌కు ఎమ్మెల్యే సీటు ఇవ్వకుండా స్థానికేతరుడైన గుంటూరు మేయర్‌ను చిలకలూరిపేట నుంచి బరిలోకి దించి చేతులు కాల్చుకున్నారు. ఇక రజినీ గుంటూరులో కూడా ఓడిపోయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో తిరిగి మర్రిని జగన్ తన వద్దకు పిలిపించుకొని ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ముఖ్య నేతల సమక్షంలో ఈసారి చిలకలూరిపేట ఇన్‌చార్జ్ బాధ్యతలు అతనికే ఇస్తానని చెప్పటమే కాకుండా, ఎమ్మెల్యే సీటు అతని భార్యకు ఇస్తానని, ఈ విషయాన్ని త్వరలో ప్రకటిస్తానని చెప్పి పంపించారు.

మళ్లీ రజినీకే బాధ్యతలు అప్పగించడంతో..

అయితే కొద్ది రోజులకే జగన్ హఠాత్తుగా తిరిగి రజినీకి చిలకలూరిపేట ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ వచ్చే ఎన్నికల్లో అక్కడ నుంచే పోటీ చేసేందుకు పరోక్షంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో మరోసారి మర్రి విషయంలో వైసీపీ అధినేత మాట తప్పి అవమాన పరిచాడు. ఈ పరిణామాన్ని జిల్లాలోని ఆ పార్టీ పెద్దలు సైతం జీర్ణించుకోలేకపోయారు. దీంతో మర్రికి ఇక వైసీపీలో తాను ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కదనే నిర్ణయానికి వచ్చారు. ఒక రకంగా చిలకలూరిపేట అంటే కాంగ్రెస్ హయాంలో మర్రి మామ సోమేపల్లి సాంబయ్య పేరు ఆ తరువాత కాంగ్రెస్‌లోనూ, వైసీపీలోనూ రాజశేఖర్ పేరే వినిపించేది. అటువంటి రాజకీయ చరిత్ర ఉన్నప్పటికీ ప్రస్తుతం అనామకుడిగా ఉండాల్సి వస్తుందని ఆయన రగిలిపోతున్నారు. మర్రి పరిస్థితిని గమనించి వైసీపీలో ఉండగా తనకు అత్యంత ఆత్మీయుడిగా ఉన్న రాజశేఖర్‌ను టీడీపీలోకి తీసుకొచ్చేందుకు కొద్ది రోజులుగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అదే విధంగా నియోజకవర్గంలోని తన అనుయాయుల నుంచి కూడా తీవ్రస్థాయిలో ఒత్తిడి వస్తుండటంతో సంక్రాంతి పండగ తరువాత మంచి ముహూర్తం చూసుకొని టీడీపీలో చేరే ఉద్దేశంలో రాజశేఖర్ ఉన్నట్టు తెలిసింది. ఇప్పటికే జగన్‌కు ఈ సమాచారం అందటంతో జిల్లాలోని వైసీపీ నేతలను పురమాయించి అతన్ని ఆపే ప్రయత్నం చేయమని చెప్పినప్పటికీ జిల్లా నేతలు చేతులు ఎత్తేసినట్టు తెలిసింది. ఒకటి కాదు రెండు కాదు వరుస పరాభవాలతో ఆగ్రహంతో ఉన్న మర్రిని ఏమని సముదాయించగలమనే భావనతో వారు మిన్నకుండిపోయినట్లు తెలిసింది.

పేదలకు నాట్కో వైద్య సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



మునిపల్లెలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నాట్కో సంస్థ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని మునిపల్లె గ్రామంలో నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలను సోమవారం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, మేనేజింగ్ ట్రస్టీ, నాట్కో ఫార్మ లిమిటెడ్ సీఎస్ఆర్ అధిపతి కంటమణి స్వాతి ప్రారంభించారు. నాట్కో సంస్థల అధినేత నన్నపనేని వెంకయ్య చౌదరి స్వగ్రామం గోళ్లమూడిపాడు గ్రామ సమీపంలో ఈ ఆస్పత్రిని నిర్మించారు. ఆస్పత్రిని ప్రారంభించిన అతిథులు వివిధ విభాగాలను సందర్శించి వైద్య సేవలుపై ఆరా తీశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ మునిపల్లె గ్రామంలో నాట్కో ట్రస్ట్ సహకారంతో గ్రామీణ ప్రాంతంలో మంచి నాణ్యతతో కూడిన కంటి వైద్యాన్ని అందించడం హర్షణీయం అన్నారు. ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ నేత్ర వైద్యం అందించడంలో ముందంజలో ఉందని కొనియాడారు. రెండున్నర ఎకరాలలో రూ. 15 కోట్ల వ్యయంతో నిర్మించిన హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య పరికరాలు అందించి, సమగ్ర కంటి వైద్య సేవ అందించటానికి ముందుకు వచ్చారన్నారు. నాట్కో మేనేజింగ్ ట్రస్టీ స్వాతి మాట్లాడుతూ 5 లక్షల జనాభాకు సేవలు అందించే విధంగా ఈ హాస్పిటల్‌లో రూపొందించినట్లు చెప్పారు. ఏడాదికి ఐదు వేల శస్త్రచికిత్సలు అందించే సామర్థ్యంతో హాస్పిటల్ నిర్మించినట్లు తెలిపారు. డాక్టర్లు మినహా మిగిలిన సిబ్బంది మొత్తాన్ని స్థానికులనే ఎంపికచేసి శిక్షణ ఇచ్చి కేంద్రంలో నియమించినట్లు చెప్పారు. అర్హులైన పేద ప్రజలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాట్కో ఫార్మ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నన్నపనేని సదాశివరావు, ఆనందబాబు, తులసి, ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ డాక్టర్ రాజీవ్ రెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ రోహిత్ కన్నా, నెట్వర్క్ డైరెక్టర్ జీపీఆర్ఎస్ ఐ కేర్ డాక్టర్ అనన్య, ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ విజయవాడ బ్రాంచ్ హెడ్ డాక్టర్ ప్రవీణ్, కృష్ణ, వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, పక్కన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ఎన్టీఆర్ మహోన్నతుడు

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

సత్తెనపల్లి రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాల్లో తారాస్థాయికి ఎదిగి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నతుడు ఎన్టీఆర్ అని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం దీపాలదిన్నెపాలెం గ్రామంలో సోమవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ జరిగింది. కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ ఎన్టీఆర్ అంటేనే ఒక సంచల నం అన్నారు. ఆయన ఆశయాలను ముందు కు తీసుకువెళ్లి ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాజకీయాల్లో ఎన్టీఆర్ ఒక చరిత్రను సృష్టించారన్నారు. సంక్షేమం అంటే గుర్తుకు వచ్చేది ఎన్టీఆర్ అని, తరాలు మారినా ప్రజల గుండెల్లో ఆయన స్థానం పదిలం అన్నారు. ముందుగా ఎంపీ, ఎమ్మెల్యేలు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూల దండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలకు ఘనస్వాగతం పలికారు. విగ్రహ ఏర్పాటు స్థల దాత పారుపల్లి నాగేశ్వరరావు, విగ్రహదాత పారుపల్లి పాండు రంగారావును ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ మాగులూరి భాను ప్రకాష్, దరువూరి నాగేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు పాటిబండ్ల పూర్ణచంద్రరరావు, కిలారు క్రిష్ణగిరి సుమన్(గిరి), దేవరపల్లి వెంకటేశ్వరరావు, పాటిబండ్ల త్రినాథ్(చింటు), పారుపల్లి అనీల్, పారుపల్లి సాయిబాబు, నారుకొండ వీర వర ప్రసాదు, బోడెపూడి కోటేశ్వరరావు, గోళ్ళమూడి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గౌతమబుద్ధుని సూక్తులు ఆచరించాలి



బౌద్ధ స్థూపం వద్ద దీపోత్సవంలో పాల్గొన్న బౌద్ధభిక్షువు బోధిహిన్, ఉపాసకులు

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సమ సమాజంలో శాంతి, సౌఖ్యం విరజిల్లాలంటే గౌతమ బుద్ధుని ఆశయాలు, సూక్తులు ప్రజలంతా ఆచరించాలని శ్రీలంక బౌద్ధ భిక్షువు బోధిహిన్ పేర్కొన్నారు. సోమవారం పౌర్ణమి పురస్కరించుకుని మండల కేంద్రం భట్టిప్రోలులోని బౌద్ధారామంలో స్థూపం చుట్టూ ప్రదక్షిణలు చేసి దీపారాధన చేశారు. అనంతరం సుదర్శన మోహనరావు అధ్యక్షతన జరిగిన సభలో బౌద్ధ భిక్షువు బోధిహిన్ మాట్లాడుతూ మనిషి చెప్పిన ప్రకారం అతని ఆత్మ నడుచుకున్నప్పుడే సమాజంలో శాంతి విరాజిల్లుతుందన్నారు. బుద్ధుని సూక్తులను వివరించారు. స్థూపం ఆవరణలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని సూచించారు. ప్రకాశం జిల్లా ఏఎస్పీ ఎంఎస్ఎస్ అశోక్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బుద్ధిజాన్ని స్వీకరించారని చెప్పారు. కార్యక్రమంలో తుపాకుల హరిప్రసాద్, ఏవీఎస్ రాజు, ఈగ శ్రీనివాసరావు, క్రాంతి, కసుకుర్తి హరిప్రసాద్, తిరుమలశెట్టి ప్రసన్నకుమార్, బౌద్ధ ఉపాసకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పడవ పోటీల్లో.. విజేతగా రామాపురం పల్లెకారుల జట్టు



ఆత్రేయపురం పడవ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన రామాపురం పల్లెకారుల జట్టు

దాచేపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరిగిన పడవ పోటీల్లో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం పల్లెకారుల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. సేకరించిన వివరాల మేరకు.. కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో సంక్రాంతి పండగకు పడవ పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. పడవ పోటీలకు కేరళ, విజయవాడ, కృష్ణా, నాగాయలంక, కోటిపల్లి, ఎన్టీఆర్, భీమవరం జిల్లాల నుంచి హాజరయ్యారు. ఈ క్రీడలకు అన్నిజిల్లాలతోపాటు పల్నాడు జిల్లా, దాచేపల్లి మండలం, రామాపురం గ్రామానికి చెందిన పల్లెకారులు హాజరయ్యారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పల్లెకారులు తమ ప్రతిభను విశేషంగా చాటి మొదటిస్థానంలో నిలిచారు. పల్నాడు ప్రాంతానికి చెందిన పల్లెకారులు కోనసీమ జిల్లాలో పోటీ పడవలు నడిపే జట్ల కంటే అత్యంత నైపుణ్యంగా ముందుగా నడిపి స్థానికుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. స్థానిక కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా లక్ష రూపాయల నగదు, షీల్డు అందుకున్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారిలో జట్టు కెప్టెన్ మల్లాడి సైదులు, పొప్పుడి వీరబాబు, తేలు చినరాజు, కర్రా నాగరాజు, కర్రా రాంబాబు, కొల్లి జాని, కొల్లి సందీప్, మల్లాడి చినసైదులు, చోడారి కిరణ్, మల్లాడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు మరో జట్టు కూడా పాల్గొంది.

విశ్రాంత ఎస్పీ మాణిక్యాలరావు మృతి



మాణిక్యాలరావు (ఫైల్‌ఫొటో)

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఎస్పీ ఉద్దంటి మాణిక్యాలరావు (75) అనారోగ్యంతో గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆయన 1970లో ఎస్ఐగా శిక్షణ పూర్తి చేశారు. ఎస్ఐగా తాడికొండ, పట్టాభిపురం, లాలాపేట తదితర స్టేషన్‌లలో, సీఐగా తెనాలి, గుంటూరు ఈస్ట్, నెల్లూరు ఏసీబీ, కాకినాడ సివిల్ సప్లయస్, జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో పని చేశారు. డీఎస్పీగా ఖాజీపేట, పాలకొండ, గుంటూరు ఇంటిలెజెన్స్‌లో పని చేశారు. కరీంనగర్‌లో ఏఎస్పీగా, ఎస్పీగా పని చేస్తూ 2007లో ఉద్యోగ విరమణ చేశారు. ఏపీ విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎ.రవిచంద్ర, ఎం రంగప్రసాదరావు, డి.సుబ్బారెడ్డి, గౌరవ అధ్యక్షుడు వెల్లంకి లక్ష్మీనారాయణ, వాసుదేవరెడ్డి, భూపాల్ సింగ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాలకొండయ్య, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఆర్ నాయుడు, విశ్రాంత డీజీపీ రాజీవ్ త్రివేది, ఎంవీ కృష్ణారావు, జి.నారాయణ స్వామి సంతాపం తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కొత్తపేటలో భారీ చోరీ

● 379 గ్రాముల బంగారం, ఐదు వేలు నగదు అపహరణ



దొంగలు లూటీ చేసిన బీరువా, పక్కన బాధితులు

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేట రంగా బొమ్మ వెనుక శ్రీలక్ష్మీ హాస్పిటల్స్ పక్క వీధిలో నివాసం ఉంటున్న దేవరకొండ వెంకటరమణ ఇంటిలో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. సుమారు రూ. 27 లక్షల ఖరీదైన 379 గ్రాముల బంగారు ఆభరణాలు, ఐదువేల నగదు అపహరించుకుపోయారు. వెంకట రమణకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గతంలో వెంకట రమణ ఆటో నడిపేవారు. కళ్లు సరిగా కనిపించకపోవడంతో ఆటో నడపడం మానేశారు. ముగ్గురు కుమార్తెలు వేర్వేరు చోట్ల ఉండి చదువుకుంటున్నారు. పండగకు ఇంటికి వచ్చారు. బంగారం పెట్టుకోవాలని బ్యాంకులో ఉంచిన ఆభరణాలను ఇంటికి తెచ్చుకున్నారు. ఆదివారం రాత్రి వెంకటరమణ, భార్య, ముగ్గురు కుమార్తెలు ముందుగానే నిద్రించారు. అయితే పడుకున్న సమయంలో తలుపునకు లోపల గడివేయడం మర్చిపోయారు. దీంతో దొంగలు సులువుగా ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో బంగారం పెట్టి తాళాలను పరుపు దిండు కింద ఉంచారు. దీంతో దొంగలు తాళాలు తీసుకొని బీరువా తెరిచి అందులో ఉంచిన బంగారాన్ని అపహరించుకుపోయారు. సోమవారం ఉదయం చోరీ జరిగిన విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వీరయ్య చౌదరి, క్లూస్ టీం ఇంటిని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 564.30 అడుగులు ఉంది. ఇది 242.48 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9800 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6556 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 8246 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,002 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కొత్తపాలెం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

● 30 గొర్రెలతోపాటు కాపరి మృతి



తిరుపతయ్య (ఫైల్)



బాధితులతో చర్చిస్తున్న పోలీసులు

వినుకొండటౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి) ఆర్టీసీ బస్సు ఢీకొని 30 గొర్రెలతో పాటు గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కర్రె తిరుపతయ్య (18) అడవిలో గొర్రెలను మేపుకుని ఇంటికి వస్తుండగా వినుకొండ డిపోకు చెందిన బస్సు ఎర్రగొండపాలెం నుంచి వినుకొండ వస్తూ ప్రమాదవశాత్తూ గొర్రెల మందపైకి దూసుకుపోయింది. సుమారు 30 గొర్రెలతో పాటు, కాపరి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో మార్కాపురం- వినుకొండ జాతీయ రహదారి రక్తసిక్తమైంది. మృతిని బంధువులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సమీర్‌బాష రోడ్డుపై నిర్జీవంగా ఉన్న గొర్రెలను తొలగించారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఎ.శ్రీనివాసరెడ్డి సంఘటనా ప్రాంతం నుంచి పరారైనట్లు స్థానికులు తెలిపారు. మరో ఐదు నిమిషాల్లో కన్నకొడుకు ఇంటికి వస్తాడని భావించిన తల్లిదండ్రులు గాలెయ్య, రవణమ్మ మృతి చెందాడని తెలిసి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇద్దరు కుమారుల్లో చిన్న కుమారుడు మృతి చెందాడు. ఎస్ఐ సమీర్‌బాష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాధితులు తమకు న్యాయం చేయాలంటూ జాతీయ రహదారిపై అర్ధరాత్రి వరకూ ధర్నా చేశారు. దీంతో ఛీప్‌విప్ జీవీ ఆంజనేయులు సూచన మేరకు సీఐ శోభన్‌బాబు బాధితులతో చర్చించి న్యాయం చేస్తామని రాతపూర్వక హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130.139.150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

నేడు శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి

కర్లపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలో వేంచేసియున్న శ్రీమహాశాస్త్ర హరిహరపుత్ర శ్రీఅయ్యప్పస్వామివారి గుడి ప్రాంగణంలో మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం ఉదయం 11గంటలకు స్వామివారి ఊరేగింపు ఘనంగా జరుగునని ఆలయ కమిటీ అయ్యప్ప సేవాసంఘం వారు తెలిపారు సాయంత్రం 6.48నిమిషాలకు ఆకాశజ్యోతి (మకరజ్యోతి) ఎగురవేసి కర్పూర హారతులిస్తారన్నారు. మండల నలుమూలల నుంచి భక్తులు జ్యోతి కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని అయ్యప్ప సేవాసంఘంవారు కోరారు.

అనంత భోగేశ్వరస్వామికి అన్నాభిషేకం



కొల్లూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): శివముక్కోటిని ఘనంగా నిర్వహించారు. సోమవారం కొల్లూరులోని అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో శివముక్కోటిని పురస్కరించుకుని అరుద్రోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి తెల్లవారుజామున మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, అన్నాభిషేకం కార్యక్రమాలు ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనంలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా కార్యక్రమాలను ఈవో ఎన్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

శ్రీబగళాముఖి అమ్మవారికి విశేష పూజలు



పిట్టలవానిపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలులో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారికి భోగిపర్వదినం సందర్భంగా సోమవారం ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఆభరణాలు, పూలదండలతో అలంకరించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వందలా ది మంది భక్తులు శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు పనులు ముమ్మరం

బాపట్లరూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం భర్తీపూడి గ్రామంలో నందమూరి తారకరామారావు నూతన విగ్రహ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు భర్తీపూడి సర్పంచ్ అచంట అమరేష్ అన్నారు. సోమవారం గ్రామస్థులతో సర్పంచ్ అమరేష్ కలిసి ఎన్టీఆర్ నూతన విగ్రహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. త్వరలోనే ఎమ్మెల్యే నరేంద్రవర్మ చేతులమీదగా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.

జిల్లా ఇన్‌చార్జి మలేరియాధికారిగా డాక్టర్ గోపినాథ్

కర్లపాలెం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్‌గా పనిచేస్తున్న మంచికలపాటి గోపినాథ్‌ను జిల్లా ఇన్‌చార్జి మలేరియాధికారిగా నియమిస్తూ జిల్లా వైద్యశాఖాధికారి విజయమ్మ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. డాక్టర్ గోపినాథ్ జిల్లా మలేరియాధికారిగా బాధ్యతలు స్వీకరిచారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ డీఎంహెచ్‌వో తమపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయి లో పనిచేసి నెరవేరుస్తానని గోపినాథ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

బాపట్లరూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ నాగేంద్రపురం గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి (43) అనే వ్యక్తి గ్రామ సమీపంలో ఉన్న జాతీయ రహదారి 216పై నడుచుకుంటూ తన పొలానికి వెళుతుండగా వెదుళ్లపల్లి నుంచి బాపట్ల వైపునకు వస్తున్న కారు వేగంగా అతడిని ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు ప్రమాదానికి కారణమైన కారును గుర్తించి అదుపులోకి తీసుకొని పోలీసులకు సమాచారం అందించటంతో పాటు 108 వాహనానికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

బాపట్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఉప్పరపాలెం రైల్వేగేటు సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు సోమవారం రైలు కిందపడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

వైసీపీ కార్యకర్తకు కోన పరామర్శ

కర్లపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరలిలో అనారోగ్యంతో బాధపడుతున్న వైసీపీ కార్యకర్తను బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి సోమవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని అధైర్యపడవద్దు అని కార్యకర్తకు భరోసానిచ్చారు.

ఇద్దరు జూదరుల అరెస్టు

కర్లపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తనందాయపాలెం సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. వారి నుంచి రెండుకోళ్ళు, రూ.800ల నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వివరించారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వేమూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని భావితరాల వారికి కూడా తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. వేమూరులో సోమవారం శ్రీకృష్ణ చైతన్య పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నాయకుడు బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు పర్యవేక్షణలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముందుగా మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులను పరిశీలించారు. బొమ్మలకొలువు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. ఎడ్లబండిపై ఊరేగుతుండగా ముందు హరిదాసుల సంకీర్తనలు మంగళ వాయిద్యాల నడుమ వీధుల్లో ఊరేగింపు జరిపారు. సరదాగా కోడిపుంజుల పందెం వేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన పైలాన్ ఆవిష్కరించి ఎన్టీఆర్ మహిళా గార్డెన్, రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను,



చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

గోకులం షెడ్లను ప్రారంభించారు. దైవరథం ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు విజయబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల జగన్ పాలనలో సంప్రదాయ విధానాలు, సంస్కృతులు మంట కలిసిపోయాయని తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో పండుగ వాతావరణం సంతరించకుందని, అభివృద్ధి శరవేగంగా ముందుకు నడుస్తుందన్నారు. వేమూరులో రూ.2 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని నియోజకవర్గం మొత్తం మీద రూ.12 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు. అలాగే ప్రజలకు సౌకర్యంగా రోడ్ల మరమ్మతులు చేపట్టారన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందని చెప్పారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో విజేతలైన మహిళలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. శ్రీకృష్ణ చైతన్య పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివన్నారాయణ, టీడీపీ రాష్ట్ర నాయకుడు కనగాల మధుసూదనప్రసాద్, తెలుగురైతు నాయకులు అమ్మిశెట్టి కిషోర్ బాబు, మహిళా నాయకురాలు ఘంటా స్వాతి, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త ఊసా రాజేష్ వివిధ శాఖల అధికారులు, నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి జనసేన, టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భోగభాగ్యాలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
● వైభవంగా భోగి వేడుకలు

బాపట్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా భోగభాగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆకాంక్షించారు. పట్టణంలోని శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయం దగ్గర సోమవారం తెల్లవారుజామున భోగిమంటలతో సంక్రాంతి వేడుకలను ఎమ్మెల్యే ప్రారంభించారు. గంగిరెద్దుల విన్యాసం, హరిదాసుల సంకీర్తనలతో కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. భోగిమంటలు వేసి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే అక్కడ పొంగళి పొంగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భావదేవుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలంతా సంతోషంగా ఉండాలని భావదేవుని వేడుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేషు కృష్ణ, కిషోర్, ఆలయ ఈవో డి.వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు బి.బాబునాగేంద్ర, రమేష్‌కుమార్, రమణబాబు, కొటికం సుబ్బారావు గురుస్వామి, పండితులు, భక్తులు పాల్గొన్నారు.



భావన్నారాయణస్వామి దేవాలయంలో పొంగలి తయారీలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



నందిరాజుతోటలో భోగిమంటలు వేస్తున్న తాతా జయప్రకాష్ నారాయణ తదితరులు

సంక్రాంతి వేడుకలు సంతోషంగా జరుపుకోవాలి

● టీడీపీ మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరి విజేత

సంక్రాంతి వేడుకలను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని మాజీ ఎంపీపీ, టీడీపీ రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరి మానం విజేత పేర్కొన్నారు. పట్టణంలోని విజయలక్ష్మీపురంలో సోమవారం భోగి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, మాజీ ఉపసర్పంచ్ కె.భాస్కరరాజు, ఎంఎస్ సాఫ్ట్‌వేర్ అధినేత ఎం శేషు కృష్ణ, న్యాయవాది దుద్దుకూరి భాస్కరరావు, పుట్టా ఆదిశేషారెడ్డి, పువ్వాడ యలమంద, డి.వెంకటేశ్వర్లు, రుక్మదరావు, కళ్యాణ్ తదితరులు కుటుంబసభ్యులతో కలిసి వేడుకను ఘనంగా నిర్వహించారు.

నందిరాజుతోటలో భోగిమంటలు

మండలంలోని నందిరాజుతోటలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి, కల్లుగీత ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో భోగి మంటలు వేసి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో తాతా బసవ శంకర్, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెం మండలంలో..

కర్లపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 20 పంచాయతీల్లో సోమవారం వేకువ జామున సంప్రదాయబద్ధంగా భోగిమంటలు వేశారు. బంధువులకు, స్నేహితులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కర్లపాలెంలోని ఆర్యవైశ్య సంఘం, క్షత్రియ, తెలగ సంఘం ఆధ్వర్యంలో భోగిమంటలు వేశారు.

చుండూరు మండలంలో..

చుండూరు (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేడుకల్లో భాగంగా సోమవారం భోగి సంబరాలను గ్రామాల్లో వేడుకగా నిర్వహించుకున్నారు. చినపరిమిలోని గంగా పార్వతి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆరుద్రోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మున్నంగివారిపాలెంలోని రామాలయంలో గోదా కల్యాణం కొసనా వాసుదేవ్ ఆధ్వర్యంలో జరిగింది. నడిగెడ్డపాలెంలోని చిన్నజీయర్‌స్వామి వారి వాసుదాసు ఆశ్రమంలో జరిగిన గోదా కళ్యాణంలో ఉత్సవ ఊరేగింపుల్లో మహిళలు అత్యధికంగా పాల్గొన్నారు. మోదుకూరు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదా కల్యాణం విశేషంగా నిర్వహించారు.

చెరుకుపల్లి మండలంలో..

చెరుకుపల్లి(ఆంధ్రజ్యోతి): గూడవల్లిలోని జీఏఆర్ చౌదరి కల్యాణమండపం ప్రాంగణంలో గూడవల్లి - నడింపల్లి గ్రామాల కమ్మసంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగిపండుగను వేడుకగా జరుపుకున్నారు.

ఆరుద్రోత్సవం, శివముక్కోటి ప్రత్యేక పూజలు

పిట్టవానిపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలులో ఉన్న శ్రీలింగోద్భవస్వామి వారి దేవస్థానంలో ఆరుద్రోత్సవం నిర్వహించారు. శివముక్కోటి పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున 4గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం, మహాన్యాసపూర్వక ఏకాదశి, రుద్రవారాభిషేకాలు, అన్నాభిషేకాలు ఆలయ అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో 12అడుగుల ఎత్తుగల పాలగ్రామచింతామణి మహాశివలింగానికి వైభవంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. ప్రాచీన శైవక్షేత్రంలో జరిగిన ఈ ఆరుద్రోత్సవానికి సుదీర్ఘప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు.



12అడుగుల ఎత్తుగల పాలగ్రామచింతామణి మహాశివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు, భక్తులు

● **వేమూరు (ఆంధ్రజ్యోతి)** : మండలపరిధి గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం శివ ముక్కోటి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేమూరు, జంపని, చంపాడు, బూతుమల్లి, చదలవాడ, అబ్బనగూడవల్లి, చావలి, పెరవలి గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారుజామున సుప్రభాత సేవ అనంతరం శుభాభిషేకం జరిపి గంగా పార్వతీ సమేత పరమేశ్వరుడి ఉత్సవమూర్తులను నంది వాహనంపై ప్రతిష్ఠించి ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిచ్చారు. జంపని రామేశ్వరాలయం, చావలి వాలేశ్వరాలయాల్లో విశేషంగా ఏకారుద్రాభిషేకం అన్నాభిషేకాలు నిర్వహించారు. పల్లకీపై నుంచి ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. జంపని రామేశ్వరాలయంలో స్వామివారికి విశేష అలంకరణ జరిపి శివముక్కోటి విశిష్టతను భక్తులకు వివరించారు.

● **చెరుకుపల్లి(ఆంధ్రజ్యోతి)**: చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని ఆనందీశ్వరస్వామి దేవస్థానంలో శివముక్కోటి సందర్భంగా ఏకాదశి రుద్రావారాభిషేకం, అన్నాభిషేకం జరిగాయి. అనంతరం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆనందీశ్వరస్వామి వారిని ఉత్తరద్వారదర్శనమునకు ఏర్పాటు చేశారు.

ఐక్యమత్యమే మహాబలం : ఎస్‌ఐ

కొల్లూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఐక్యమత్యంగా అదే పెద్ద బలమని ఎస్‌ఐ జి.ఏడుకొండలు తెలిపారు. సోమవారం తోకలవానిపాలెంలో ఎస్‌ఎఫ్‌ఐ, వ్యవసాయ కార్మిక సంఘం డీవైఎఫ్‌ఐ, ఐద్వా, ప్రజా నాట్య మండలి సంఘాల ఆధ్వర్యంలో సర్పంచ్ కృష్ణ మోహన్ నేతృత్వంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా ఐక్యమత్యంతో సంబరాలు జరుపుకోవడం అభినందనీయమన్నారు.

ఇండియన్ మెట్రలాజికల్ ఒలింపియాడ్‌లో పబ్లిక్‌స్కూల్ విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని దగ్గుమల్లి నిహారికకు మెమొంటో అందజేస్తున్న నిర్వాహకులు

బాపట్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెట్రలాజికల్ ఒలింపియాడ్‌లో బాపట్ల పబ్లిక్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని దగ్గుమల్లి నిహారిక అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచింది. న్యూఢిల్లీ మెట్రాలజికల్ డిపార్ట్‌మెంట్‌వారు నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ప్రతిభ కనబరిచిన నిహారికను మెమొంటోతో అభినందించారు. ఈ సందర్భంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు అభినందించారు.

సామూహిక భోగిపండ్ల ఆశీర్వచనం

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు సామూహిక భోగిపండ్ల ఆశీర్వచన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం భోగి పండుగ పురస్కరించుకుని మండలపరిధిలోని ఐలవరం వేణుగోపాలస్వామి దేవస్థానంలో దీవి సుజాత ఆధ్వర్యంలో చిన్నారులకు భోగిపళ్లు పోశారు. సాయంత్రం సమరసత నగర సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో గోదా రంగనాయక కల్యాణం, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో భాస్కర వెంకటరమణ, పి.నాగేశ్వరరవు, వి.కోటేశ్వరరావు, జగన్, హేమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమాకోరేగావ్ విజయోత్సవాలు

వేమూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుచ్చెళ్లపాడులో సోమవారం జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో భీమాకోరేగావ్ విజయోత్సవాలు నిర్వహించారు. ఆంధ్ర యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జైభీమ్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు బోరుగడ్డ సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి గౌరవాధ్యక్షుడు వాసిమళ్ల వెంకటరత్నం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక చైతన్యం కలిగి జీవితాల్లో అభివృద్ధి సాధించాలంటే అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సభలో పెరికల సువర్ణసుందరరావు, మేరుగ రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి

● భోగి మంటల్లో బిల్లులు దహనం చేసి నిరసన

భట్టిప్రోలు (కొల్లూరు), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీగా విద్యుత్ చార్జీలు పెంచమని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. భట్టిప్రోలు, పెదపులివర్రు గ్రామాల్లో సోమవారం భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జి.సుధాకర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపిందన్నారు. ఆదాని కంపెనీతో తయారు చేసిన స్మార్ట్ మీటర్లు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు బిగించే ప్రయత్నం జరిగిందని అప్పుడు టీడీపీ నాయకులు విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టారని ప్రచారం చేశారన్నారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అదాని కంపెనీ తయారు చేసిన మీటర్లు బిగించాలని పూనుకున్నారన్నారు. పెంచిన ట్రూఅప్, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్యనారాయణ, నాగరాజు, మనోజ్‌కుమార్, అహరోను తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల(ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ సర్కిల్‌లో సీపీఐ సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్ పార్టీశ్రేణులతో కలిసి విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులపై పెనుభారం మోపుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మామిడి బత్తుల అశోక్ పాల్గొన్నారు.

చిరువ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి : మేకల ప్రసాద్

బాపట్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల మార్కెట్‌లో ఆకుకూరలు, కూరగాయలు అమ్ముకునే చిరువ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మార్కెట్‌ను సందర్శించి చిరువ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చిరువ్యాపారుల జీవనాన్ని దెబ్బతీసే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరించాలన్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు ఆకుకూరలు, తట్టలలో కూరగాయలు అమ్ముకునే వారితో సమావేశం నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకొని వారి జీవనానికి ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ చొరవ చూపాలని కోరారు.

సంబరాల్లో కొలువుతీరిన బొమ్మలు



పట్టణంలోని రెండు గృహాల్లో ఏర్పాటు చేసుకున్న బొమ్మల కొలువులు

రేపల్లె, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బొమ్మల కొలువులు.. రంగుల రంగవల్లులు.. గొబ్బి పాటలు.. కోలాటాలు.. గంగిరెద్దుల విన్యాసాలు.. గాలిపటాల సోయగాలు.. వెరసి తెలుగు సంస్కృతీ సంప్రదాయాల కలబోత సంక్రాంతి సంబరాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. వృత్తిరీత్యా ఎక్కడెక్కడో పని చేస్తున్న వారు తమ కుటుంబాలతో సహా స్వగ్రామాలకు వచ్చి ఆత్మీయ అనురాగాలతో సంక్రాంతి వేడుకల్లో పాల్గొనటంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. కొత్త అల్లుళ్ళు, బంధువుల రాకతో ఇళ్ళల్లో పండుగ శోభ ఇప్పటికే సంతరించుకుంది. ముంగిళ్ళలో సంక్రాంతి ముగ్గులు వేసి రంగులు దిద్ది సంకాంత్రి లక్ష్మికి ఆహ్వానం పలుకుతున్నారు. గొబ్బి పేరంటాలు, పిండి వంటలు, విశ్వంలోని వివిధ రకాల మట్టితో చేసిన హస్తకళల ద్వారా చేసిన దేవతామూర్తులు, రుషులు, మానవులు, జంతువుల, ప్రకృతికి సంబంధించిన చెట్లను బొమ్మల కొలువులలో ఏర్పాటు చేసి పిల్లలకు సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేస్తున్నారు. పేరంటాలతో వీధులు కొత్తదనాన్ని సంతరించుకున్నాయి.

శ్రీరామలింగేశ్వరస్వామికి విశేష అభిషేకాలు



రామలింగేశ్వరస్వామికి ఆరుద్ర మహోత్సవ అభిషేకం చేస్తున్న అర్చకులు

బాపట్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణలోని ఎస్‌ఎన్‌పీ అగ్రహారంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహాన్యాసపూర్వక ఏకాదశ విశేషద్రవ్య రుద్రాభిషేకం, అన్నాభిషేకం భారీఎత్తున జరిగింది. కార్యక్రమానికి అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారికి విశేష హారతుల తర్వాత ఉత్తరద్వారంలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారి గ్రామోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు ప్రసాదస్వామి పర్యవేక్షణలో చిట్టిబాబు, సాయివెంకట్, నెమలికంటి హనుమంతరావు, కౌండిన్య, సురేష్, వెంకట్, ఆలయ ధర్మకర్తలు హరినారాయణ, ఏడుకొండలు, భక్తులు పాల్గొన్నారు.

జంపనిలో వైభవంగా గోదాకృష్ణుల కల్యాణం



చెన్నకేశవ ఆలయంలో గోదాకృష్ణుల కల్యాణం

వేమూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా సోమవారం భోగి పండుగను పురస్కరించుకుని జంపని చెన్నకేశవాలయంలో గోదాకృష్ణుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మన్నె వెంకటసుబ్బరావు, లక్ష్మీ దంపతులు ఉత్సవకర్తలుగా వ్యవహరించారు. పండిత దీవి లక్ష్మీనరసింహాచార్యులు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం గోదా కృష్ణుల కల్యాణం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అష్టలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో..



గోదాదేవి కల్యాణం వీక్షిస్తున్న భక్తులు

బాపట్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నరాల శెట్టివారిపాలెంలో ఉన్న శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో సోమవారం గోదాదేవి కల్యాణమహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవాలయంలో నెలరోజులు నుంచి శ్రీ గోదాదేవి తిరుప్పావై నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించి 2వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఐదుపందేలు గెలవడంతో బుల్లెట్‌ను గెలుచుకున్న ప్రతాప్

● చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో వీఐపీబరిలో కోడిపందేలు జోరుగా సాగాయి. నగరం మండలం మంత్రిపాలెంనకు చెందిన వసంతంప్రతాప్ వరుసగా ఐదుపందేలు గెలవటంతో బుల్లెట్‌ను చేజిక్కించుకున్నారు. దీంతో పందెంరాయుళ్ళకు మరింత ఉత్సాహం వచ్చింది. పందేలు మేము వేస్తామంటూ ముందుకు వచ్చారు. సంవత్సరం నుంచి లక్షలాది రూపాయలు వెచ్చించి పందేలకు కోళ్ళను సిద్ధం చేశామని ఈ సంక్రాంతి సంబరాల్లో వరుసగా ఐదు పందేలు గెలవటంతో బుల్లెట్‌రావటం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.

వేడుకగా.. భోగి

భోగి మంటలు.. భోగిపండ్లు. రంగుల రంగవల్లులు.. బొమ్మల కొలువులు.. ఎగిరే గాలిపటాలు.. హరిదాసుల కీర్తనలు.. గంగిరేద్దుల ఆటలు.. ఘుమ ఘుమలాడే పిండి వంటలతో సంక్రాంతి పండక్కి స్వాగతం పలుకుతూ, వెలుగుల ఉత్తరాయణాన్ని ఆహ్వానించే భోగ భాగ్యాల భోగిని పల్లెలు, పట్టణాల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునే పట్టణాలు, పల్లెల్లో ప్రధాన కూడళ్లతో పాటు ఇళ్ల ముంగిళ్ల లో భోగిమంటలు వేసి సంక్రాంతి సంబరాలను వేడుకగా సోమ వారం ప్రారంభించారు. సామాన్య ప్రజలతో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు భోగి కార్యక్రమాలను వేడుకగా జరుపుకున్నారు. దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి కల్యాణోత్సవాలు నేత్ర పర్వంగా జరిగాయి. జిల్లా అంతటా సంక్రాంతి శోభ నెలకొంది.



- ఆలయాల్లో విశేష పూజలు
- శ్రీవారికి కల్యాణోత్సవాలు
- చిన్నారులకు భోగి పండ్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగలో మొదటి రోజైన భోగిని అన్ని వర్గాల ప్రజలు కోలాహలంగా జరుపుకున్నారు. దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వారు స్వగ్రామాల్లో మిత్రులు కుటుంబ సభ్యులతో కలసి భోగి మంటలు వేసి ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు. పిండి వంటల ఘుమ ఘుమలు, బంధువులు, కుటుంబ సభ్యుల సందడితో పల్లెలు శోభిల్లాయి. కుల మతాలకు అతీతంగా రైతులు, వ్యవసాయ కూలీలు జరుపుకునే పండుగ కావడంతో సంక్రాంతి పర్వదినానికి అన్ని వర్గాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారితో పాటు బంధువుల రాకతో గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. పల్లెల్లో ముగ్గుల పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహించారు. భోగిమంటల అనంతరం దేవాలయాలకు భక్తులు తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల ముందు ఒకరికొకరు పోటీ పడి భోగి ముగ్గులతో వాకిళ్లను అందంగా తీర్చి దిద్దారు. ఆ ముగ్గుల్లో గోబ్బెమ్మలను అలంకరించారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా గాలి పటాలను ఎగుర వేసి ఆనందోత్సాహలను వ్యక్తం చేశారు. చిన్నారులకు పెద్దలు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. భోగి పండుగ రోజు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు తెల్లవారు జామునుంచి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లో గోదాదేవి కళ్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణోత్స వాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సావాలను కనులారా తిలకించారు.



తెనాలి జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి మనోహర్



నరసరావుపేట పట్టణంలో భోగి మంటల వద్ద నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో భోగి మంటను వెలిగిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి కమిషనర్ పులి శ్రీనివాసులు.



యడ్లపాడులో భోగి మంటలు వేస్తున్న స్థానికులు



బాపట్ల విజయలక్ష్మీపురంలో భోగి వేడుకల్లో టీడీపీ నేతలు



మాచవరం మండలం వేమవరంలో హరిదాసుకి చిరు ధాన్యాలు వేస్తున్న చిన్నారులు



కొల్లిపరలో గ్రామంలో ఇంట ముంగిళ్లలో డూడూ బసవన్నల సందడి



మాచర్ల పట్టణంలోని 16వ వార్డులో భోగి మంటల వద్ద మహిళలు



వట్టిచెరుకూరులో భోగి మంటలు వేస్తూ ఆనందిస్తున్న స్థానికులు



బాపట్లలో క్షీర భావన్నారాయణ స్వామి దేవాలయం ఎదుట భోగిమంటలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ.



రొంపిచర్లలో భోగి మంటల కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

హోరాహోరీగా మంగళగిరి ప్రీమియర్ లీగ్

మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో ఉత్కంఠగా సాగుతున్న పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మంగళగిరి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగున్న ప్రీమియర్ లీగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజు విజయనగరం-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కర్నూలు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు 11.04 ఓవర్లలో 3 వికెట్ల నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది.

శ్రీకాకుళంతో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేయగా, శ్రీకాకుళం జట్టు 3 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. రెండు మ్యాచ్‌లలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారులకు బోగి వినోద్, కనికళ్ల చిరంజీవి సహకారంతో రూ.పది వేల చొప్పున బహుమతిని అందజేశారు. ఈ పోటలకు సేల్, సక్కు, మార్క్‌రోస్, ఉషోదయ, వి-డిజిటల్ సంస్థలు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

అలరించిన బొమ్మల కొలువు!

ఆసక్తిగా వీక్షించిన మహిళలు



బాపట్ల,జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : బాపట్లపట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో పాపినేని వారి ఇంట బొమ్మలు కొలువు తీరాయి. అంధమైన బొమ్మల అలంకారం నాలుగు దశాబ్దాలుగా ప్రతి ఏటా ఇక్కడ నిర్వహిస్తున్నారు. విశేషంగా ఆకర్షిస్తున్న బొమ్మల కొలువు చూడముచ్చటగా సింగారించుకున్న అలంకారం.... బాపట్లలో కనువిందు చేస్తున్నసింగారం. ప్రతి ఏటా పాపినేని వారి ఇంట కొలువు తీరే అంబరం రమణీయత ఉట్టిపడే అద్భుత సంబరంగా మారింది. వేలాది బొమ్మలు సేకరించి ఆ ఇంట ప్రదర్శించటం ఆనవాయితీగా వస్తున్నది. సంక్రాంతి పర్వదినాలలో ప్రత్యేక ఆకర్షణీయమైన బొమ్మల కొలువు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. సంక్రాంతిలో కనిపించే ఈ సంస్కృతికి శ్రీకారం చుట్టారు. బాపట్లకు చెందిన పాపినేని ధనలక్ష్మీ కుటుంబం 1984 నుంచి వివిధ రకాల బొమ్మలు సేకరించటం మొదలు పెట్టారు. విహారయాత్రకు వెళ్ళిన ప్రతిసారి కొన్నిబొమ్మలు తీసుకురావటం, ఇంట్లో ప్రదర్శనగా ఉంచటం చేస్తున్నారు. ఒకప్పుడు 10 బొమ్మలతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ప్రస్తుతం వేల బొమ్మలు కొలువుతీరాయి. ప్రకృతి రమణీయతను ఉట్టిపడే అందాలు, ఆరుగాలం శ్రమించే అన్నదాతలు, అంధంగా కనిపించే రమణీయ దృశ్యాలు, దేవాలయాలు, దేవుళ్ళ బొమ్మలు, దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఉన్న సుప్రసిద్ధ పర్యాటక కేంద్రాలు, పల్లె వాతావరణం ప్రతిబింబించేలా దృశ్యాలు, ముఖ్యంగా మత సామరస్యాన్ని చాటి చెప్పే అందమైన బొమ్మలు సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. ప్రతి ఏటా భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలలో బొమ్మలు ప్రదర్శిస్తున్నట్లు ధనలక్ష్మీ తెలిపారు.



బాపట్ల పట్టణంలోని పాపినేని వారి ఇంట కొలువు తీరిన బొమ్మల కొలువు



ఈ బొమ్మల కొలువుది కుటుంబ సభ్యులంత కలిసి వేడుకగా జరుపుకుంటున్నారు. దీనిని తిలకించేందుకు పరిసరప్రాంత మహిళలు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. 15వ తేది వరకు బొమ్మల కొలువు అందుబాటులో ఉంటుందని పాపినేని ధనలక్ష్మీ, పాపినేని రాధాకృష్ణ, పాపినేని నాగదేవి ప్రసాద్‌లు తెలిపారు. సాయంత్రం 6 గంటలు నుంచి 10 గంటల వరకు బొమ్మల కొలువు దర్శించవచ్చని అన్నారు.

నువ్వా.. నేనా..!



- యార్డు కార్యదర్శి పోస్టుకోసం పోటాపోటీ
- గ్రూపు-1 అధికారిణి రానున్నట్లు ప్రచారం
- కొనసాగేందుకు 'వినుకొండ' ముమ్మర ప్రయత్నాలు

గుంటూరు సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మిర్చి ఎగుమతిలో ఆసియాలో నే అతి పెద్దదిగా పిలువబడే గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు కోసం గట్టిపోటీ నెలకొంది.ఈ పోస్టు కోసం ఉత్తరాంధ్ర కు చెందిన గ్రూపు-1 అధికారిణి ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆ పోస్టు లో ఉన్న వినుకొండ ఆంజనేయులు పరిస్థితి గందరగోళం గా మారింది. ఏడాది కి సుమారు వేల కోట్ల రూపాయలు పైబడి టర్నోవర్ కలిగిన గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు అంటే ఎప్పుడూ హాట్ కేక్ లా ఉంటుంది. ఈ పోస్టును దక్కించుకునేందుకు మార్కెటింగ్ శాఖ ఉద్యోగులు చెయ్యని ప్రయత్నాలు అంటూ ఉండవు. ఉన్నత స్థాయి రాజకీయ నాయకుల దగ్గర నుంచి రాష్ట్ర అధికారుల దాయదక్షిణ్యాలు మెండుగా ఉంటేనే పోస్టు దక్కుతుంది. ఒక్క సీజన్ లో యార్డు కార్యదర్శి గా పనిచేసినా జీవితం సెటిల్ అవుతుందన్న ఆలోచనతో మార్కెటింగ్ ఉద్యోగులు ఇక్కడ పోస్టింగ్ కోసం నానా తంటాలు పడుతుంటారు.

ఒకరు అక్కడ.. ఒకరు ఇక్కడ

గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు కోసం ప్రయత్నాలు చేస్తున్న గ్రూపు-1 అధికారిణి ఉత్తరాంధ్ర లో ఉన్నత స్థాయి పోస్టు లో వున్నారు. అయితే సదరు అధికారిణి భర్త గుంటూరు జిల్లాలో కీలకమైన పోస్టు లో ఈ మధ్య కాలంలో నే నియమితులయ్యారు.భార్యాభర్తలు ఇరువురు జిల్లా అధికారులు కావటంతో ఒకే చోట ఉండేందుకోసం యార్డు కార్యదర్శి పోస్టు వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. సదరు అధికారిణి కుటుంబంలో కూడా ప్రస్తుత కూటమి ప్రభుత్వం లో కీలకమైన స్థానంలో ఉన్నవారు వున్నారు. దాంతో ఆమె కు పోస్టింగ్ దరిదాపుగా ఖరారు అయినట్లు ప్రచారం జరుగుతోంది.

ఉండేందుకు యత్నాలు..

ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి గా వినుకొండ ఆంజనేయులు కొనసాగుతున్నారు. ఆయనకు ఇంకా 11 నెలలు మాత్రమే సర్వీసు ఉంది. అప్పటివరకు ఆ పోస్టు లో కొనసాగేందుకు ఆయన ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.గ్రూపు-1 అధికారిణి నియామకంలో తీవ్ర జాప్యం జరగడంలో ఆంజనేయులు ప్రయత్నాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఆంజనేయులుకు మద్దతుగా ఒక సామాజిక సంఘం ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో కొన్ని పోస్టు లు కూడా పెట్టటం జరిగింది. అయితే వచ్చే గ్రూపు-1 అధికారిణి కూడా అదే సామాజిక వర్గానికి చెందిన వారని తెలియటం తో కొందరు నాయకులు వెనక్కి తగ్గినట్లు సమాచారం.

నేతల జోక్యం..

యార్డు కార్యదర్శి నియామక వ్యవహారంలో కొందరు నేతలు జోక్యం చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆంజనేయులుకు అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా కొందరు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. గ్రూపు- 1 అధికారిణికి అనుకూలంగా కూడా కొందరు రాష్ట్ర నేతలు రంగ ప్రవేశం చేసినట్లు తెలిసింది. వారి చొరవతో నే ఆమె నియామకం దరిదాపుగా ఖరారు అయినట్లు అంతా అనుకున్నారు.అధికారిణి కోసం ప్రయత్నాలు చేస్తున్న రాష్ట్ర నేతలు గుంటూరు కు చెందిన కీలకమైన ప్రజాప్రతినిధులతో కూడా చర్చించినట్లు తెలుస్తోంది.

ఎప్పుడూ అంతే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు మిర్చి యార్డు కార్యదర్శి పోస్టు కోసం మినీ యుద్ధం జరిగింది. ఆ పోస్టు లోకి వచ్చేందుకు ఆ శాఖలోని అన్ని స్థాయిల అధికారులు ఉన్నత స్థాయిలో పావులు కదుపుతూ వచ్చారు. చివరకు ఎవరు కమిషనర్‌కు దగ్గరగా ఉంటారో వారికే బాధ్యతలు అప్పగించడం జరిగింది. అయితే ఒక సెక్రటరీకి మాత్రం నేతల చలవతో యార్డు పోస్టు మళ్ళీ మళ్ళీ దక్కింది. ఆ తర్వాత జరిగిన అక్రమాల్లో వీళ్లంతా ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు తేల్చారు. మొత్తం మీద యార్డు కార్యదర్శి పోస్టు వ్యవహారం ఏమి జరుగుతుందో వేచి చూడాల్సిందే.



అద్దంకి ఆణిముత్యాలు బండారు బ్రదర్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఫణీంద్రబాబు, తహసీల్దార్ ప్రభాకరరావు, దేవపాలన

అద్దంకికి గర్వకారణం బండారు బ్రదర్స్

పౌరాణిక నాటక ప్రదర్శనలు

అద్దంకి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పౌరాణిక నాటక ప్రదర్శనలతో ఒకరు, ఉపాధ్యాయునిగా మరొకరు బండారు రామారావు, వెంకటేశ్వర్లు ప్రత్యేక గుర్తింపును తీసుకు వచ్చి అద్దంకికి గర్వకారణంగా నిలిచారని టీడీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఫణీంద్రబాబు అన్నారు. రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ ఉబ్బా దేవపాలన, పురావస్తు పరిశోధకులు, రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు జ్యోతిచంద్రమౌళి రంగస్థల నటుడు బండారు రామారావు, ఉపాధ్యాయుడు బండారు వెంకటేశ్వర్లు రచించిన అద్దంకి ఆణిముత్యాలు బండారు బ్రదర్స్ పుస్తకాన్ని సోమవారం స్థానిక నంబూరివారిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. అద్దంకి ఆణిముత్యాలు బండారు బ్రదర్స్ పుస్తకాన్ని ఆదివారం అద్దంకి వచ్చిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందజేశారు. బండారు వెంకటేశ్వర్లు మనుమడు బండారు అశ్వనీకుమార్ ప్రపంచ శా స్త్రవేత్తలలో భారతదేశం తరపున 2వ స్థానంలో నిలవడం అద్దంకికి గర్వకారణం అని పలువురు వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో చినగంజాం తహసీల్దార్ ప్రభాకరరావు, రిటైర్డ్ డీఎస్పీ బీరం నాగేశ్వరరావు, డాక్టర్ దేవపాలన, జ్యోతి చం ద్రమౌళి, అన్నమనేని వెంకటరావు, బండారు ఆనందరావు పాల్గొన్నారు.

మాధవస్వామికి వెండి పాదాలు బహూకరణ

అద్దంకి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని మాధవ స్వామి దేవాలయంలో చామర్తి లక్ష్మీనాథ్, నాగమణి దంపతులు సుమారు రూ.70వేల విలువైన స్వామి వారి అలంకరణకు వినియోగించే వెండిపాదాలను సోమవారం బహూకరించారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో భోగి పండుగ ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి చిన్నారులకు ఈవో తిమ్మానాయుడు, పూజారులు భోగి పండ్లు పోశారు. చిన్నారుల తల్లిదండ్రులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బైక్.. యువకుడికి గాయాలు

మేదరమెట్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో ముందు వెళ్తున్న కారును మోటర్ సైకిల్ వెనుక ఢీకొన్న సంఘటనలో మోటర్ సైకిల్‌పై ఉన్న యువకుడికి గాయాలయ్యాయి. సోమవారం హైవేలో విజయవాడ వైపు వెళ్తున్న కారును వెనుక వస్తున్న మోటర్ సైకిల్ ఢీకొంది. మోటర్ సైకిల్‌పై వెనుక కూర్చున గోపి రాము గాయపడ్డాడు. రామును హైవే అంబులెన్స్ అద్దంకి ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

జాతీయ రహదారిలో తిమ్మనపాలెం చెక్ పోస్టు వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ విజయవాడ వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్లే మార్గంలో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వ్యక్తి స్పృహలో లేకపోవడం వలన వివరాలు తెలియలేదు. క్షతగాత్రుడిని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ఐదుగురు అరెస్టు

ఇంకొల్లు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలంలోని పావులూరు శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరాలపై సోమవారం ఎస్ఐ తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. కోడిపందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న 2 కోడి పుంజులు, రూ.1300 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు సంక్రాంతి ప్రత్యేక పూజలు

అద్దంకి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ సమీపంలోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలతో పాటు జ్యోతి దర్శనం ఏర్పాటు చేసినట్లు దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి తెలిపారు. ఉదయం 5 గంటలకు పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, సాయంత్రం 6-39 గంటలకు అయ్యప్పస్వామి దేవాలయం ఎదురు ఉన్న అద్దంకి కొండపై జ్యోతి దర్శనం, 18 మెట్లకు పడి పూజ కార్య క్రమాలు జరుగుతాయని తెలిపారు.

వైభవంగా ఆరుద్రోత్సవం



చిదంబరేశ్వరస్వామి గ్రామోత్సవం

చినగంజాం : గంగా పార్వతి సమేత చిదంబరేశ్వరస్వామి దేవస్థానంలో ఆరుద్ర మహోత్సవాన్ని (శివ ముక్కోటి) వైభవంగా నిర్వహించారు. శివుని జన్మనక్షత్రం అయిన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం వేకువజాము నుంచి వేదపండితులు ఆలయంలోని స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అభిషేకాలను నిర్వహించారు. ఆలయ పూజారి కాకుమాను రాము ఆధ్వర్యంలో గంగా పార్వతి సమేత చిదంబరేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలతో, పలు రకాల పూలమాలలతో ప్రత్యేకంగా నంది వాహనంపై అలకరించారు. పూజలు అనంతరం భక్తులు నంది వాహనంపై స్వామి వారిని ఉంచి దేవస్థానం చుట్టూ ప్రదక్షిణాలు చేయించారు. ఉత్తర ద్వార దర్శనంలో ఉన్న స్వామిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. తదనంతరం గ్రామ పుర వీధులలో స్వామి వారికి గ్రామెత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కడవకుదురు, గొనసపూడి, కొత్తపాలెం తదితర గ్రామాల్లో ఆరుద్రోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

వైసీపీ హయాంలో సంక్షేమం శూన్యం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అభివృద్ధి, సౌకర్యాలు శూన్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనర సింహారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక ఎస్సీ -2 హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్ పరి సరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవర్గాలకు చెందిన కుటుంబాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం గాలి కొదిలేసిందన్నారు. కనీస వసతులు కూడా లేక పోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆవే దన వ్యక్తం చేశారు. హాస్టళ్లల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పనకు విప్ల వాత్మక మార్పులు తీసుకురానున్నట్లు డాక్టర్ ఉగ్ర చెప్పారు. హాస్టల్‌లో వసతుల కల్పనకు అవసరమైన పనులు చేపట్టేందుకు తగిన కార్యాచరణపై సర్వశిక్షా అభియాన్ అధికారులతో మాట్లాడారు. ఈమేరకు తగిన ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

తగ్గేదేలే.. తేల్చుకుందాం

- బెల్ట్ షాపుల నిర్వహణలో ఆధిపత్య పోరు
- చీరాలలో నా మాట వినకపోతే అంతే అంటున్న అధికార పార్టీ నాయకుడు
- ఎక్సైజ్ అధికారులు నా చేతుల్లో ఉన్నారని దబాయింపు
- ఎమ్మెల్యే పేరు చెప్పి హల్‌చల్
- పర్చూరు నియోజకవర్గంలో కుదిరిన ఒప్పందాలు
- అన్ని చోట్లా అనధికార సిట్టింగ్‌లు
- హద్దులు మీరుతున్న వారి తీరు



వేటపాలెం పోలీసులు పట్టుకున్న మద్యం నిల్వలు (ఫైల్)



ఇంకొల్లులో బార్‌ను తలపిస్తూ మద్యం సేవించేందుకు టేబుల్‌లో ఉన్న మద్యం సీసాలు

చీరాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో లిక్కర్ సిండికేట్లు మధ్య ఆధిపత్య పోరు పతాక స్థాయికి చేరింది. దీంతో సంబంధిత అధికారులు స్వామి కార్యం, స్వకార్యం అన్న చందంగా పబ్బం గడుపుకుంటున్నారు. అంతిమంగా మందుబాబులు నష్టపోతున్నారు. బెల్ట్ షాపుల నిర్వహణ బహిరంగంగానే సాగుతున్నాయి. ఈ క్రమంలో ఆధిపత్య పోరు సాగుతోంది. అది పతాక స్థాయికి చేరింది. చీరాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే పేరు చెప్పి మున్సిపల్ పరిధిలోని ఓ ప్రజాప్రతినిధి భర్త అంతా తానై ఇటు ఎక్సైజ్ అటు పోలీస్‌లకు తలనొప్పిగా తయారయ్యాడని ఆయా డిపార్ట్‌మెంట్లలోని అధికారులు, సిబ్బంది మధ్య చర్చ సాగుతోంది. ఈ క్రమంలో ఇతర లైసెన్సీలు తాము మాత్రం తగ్గేదేలే.. తేల్చుకుందామంటూ సంకేతాలు ఇస్తున్నారు. ఇదంతా ఎమ్మెల్యేకు తెలిసి జరుగుతుందా లేకుంటే ఎమ్మెల్యే పేరు చెప్పి ఆ మద్యం వ్యాపారి తన దందా సాగించేందుకు అధికారులను, మద్యం వ్యాపారులను మభ్య పెడుతున్నారా అని ఆయా వర్గాల్లో చర్చ సాగుతోంది. ఆ క్రమంలో ఇటీవల నెలకొన్న పరిణామాలు చర్చనీయాంశమయ్యాయి.

పట్టుబడ్డ మద్యం సీసాలు ఏ షాపు నుంచి సరఫరా అయ్యాయి

ఇటీవల వేటపాలెం మండలం కఠారిపాలెం సమీపంలో 265 క్వార్టర్ బాటిళ్లు, 25 బీర్ సీసాలను వేటపాలెం పోలీసలు పట్టుకున్నారు. అది అక్రమంగా విక్రయించేందుకు ఉంచిన సరుకు. వాస్తవానికి సదరు మద్యం సీసాలు ఏ మద్యం దుకాణం నుంచి తెచ్చారనేది తెలుసుకునేందుకు పెద్ద సమయం పట్టదు. ఎందుకంటే ఆయా మద్యం సీసాలపై ఉన్న బార్ కోడ్ ఆధారంగా ఏ మద్యం దుకాణం నుంచి వచ్చాయనేది తెలిసిపోతుంది. అయితే సదరు విచారణకు నెల రోజుల సమయం ఉంటుందని ఆలోపు తాము పూర్తి నివేదిక తయారు చేస్తామని వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు చెప్తున్నారు.

4 క్వార్టర్ బాటిళ్లు ఉన్నందుకు కేసు

టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం హాయ్ రెస్టారెంట్ సమీపంలో ఓ వ్యక్తి నాలుగు క్వార్టర్ బాటిళ్ల మద్యం కలిగి ఉన్నాడని ఎస్సై నాగశ్రీను నిందితునిపై కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించారు. వాస్తవానికి ఒక వ్యక్తి వద్ద మూడు బాటిల్స్ ఉండొచ్చు. అయితే ఎమ్మెల్యే అంతా తననే చూచుకోమన్నాడని చెప్తూ, సదరు మహిళా ప్రజాప్రతినిధి భర్త పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసు నమోదు చేయించాడని ప్రచారం జరుగుతోంది. అయితే ఎమ్మెల్యే అనుంగ అనుచరులు అందులో ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదని ఆయన పేరును బదనాం చేసేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే సహించేది లేదని ఘాటుగా చెప్తున్నారు.

పర్చూరు నియోజకవర్గంలో కుదిరిన ఒప్పందాలు

పర్చూరు నియోజకవర్గంలో బెల్ట్ షాపుల నిర్వహణకు ఒప్పందాలు కుదిరి సజావుగా సాగుతున్నాయి. అందులో భాగంగా పలు ప్రాంతాల్లో సిట్టింగ్‌లకు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అందుకు వారికి తగిన ప్రతఫలం అందుతుందని విషయం తెలిసిన వారు అంటున్నారు.

పోలీస్ వ్యవహారం చక్కబెట్టేందుకు ఓ మాజీ సిండికేట్ వ్యాపారి

చీరాల నియోజకవర్గంలో పోలీస్ పరంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా వ్యవహారాన్ని చక్కబెట్టేందుకు మాజీ సిండికేట్ వ్యాపారి బాధ్యతలు తీసుకున్నాడు. ఇతను గతంలో ఆర్థిక లావాదేవీల్లో నమ్మకాన్ని కోల్పోయాడు. అయితే పోలీస్‌తో లావాదేవీలు నడపటంలో సిద్ధహస్తుడనే పేరుతో అతనికి ఓ వర్గం బాధ్యతలు అప్పగించారు. మిగిలిన రెండు వర్గాలు ఆచితూచి అడుగులు వేస్తున్నాయి.

అదనపు ధరలకు అమ్ముదాం..

తలా నాలుగు రూపాయలు పంచుకుందాం

చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహణలో లైసెన్సీలు ఒక అవగాహనకు వచ్చారు. అయితే ఆయా బెల్ట్ షాపుల్లో క్వార్టర్‌ను ఎంత అదనపు ధరకు విక్రయించాలనే విషయమై ఏకాభిప్రాయం రాలేదు. కొన్ని చోట్ల క్వార్టర్‌కు రూ.10 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో అదనపు ధర కూడా ఒకే విధంగా ఉండాలని చర్చలు జరుపుతున్నారు. దీంతో అంతిమంగా మందుబాబుల జేబులకు చిల్లులు పడనుంది.

ఒక్కో షాపునకు రూ. 1 లక్ష చెల్లింపు

మద్యం దుకాణాల లైసెన్సీలు తమకు అనుకూలంగా వ్యవహరించేందుకు చూసీచూడనట్లు వ్యవహరించేందుకు ఎక్సైజ్ అధికారులకు ఒక్కో దుకాణంకు రూ.1 లక్ష చెల్లించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో పోలీస్ శాఖ పరంగా తమ సంగతేంటని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా నిబంధనలను ఎంత అతిక్రమిస్తే సంబంధిత అధికారులకు అంత ప్రయోజనం చేకూరే విధంగా ఉంటుందని చెప్పుకుంటున్నారు. అంతిమంగా మద్యపాన ప్రియులు నష్టపోతారని, అది జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



ముగ్గుల పోటీలో విజేతలైన మహిళలకు బహుమతులు అందజేస్తున్న గ్రామ సర్పంచ్ నారాయణరావు

గొనసపూడి (చినగంజాం), జనవరి 13(ఆంధ్రజ్యోతి) : సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగని సర్పంచ్ విక్రం దీప్తి, లాయిడ్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత విక్రం నారాయణరావులు అన్నారు. మండలంలోని గొనసపూడి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామ సంక్రాంతి సంబరాల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి రంగవల్లుల పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాల వారికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కృష్ణ, గుంటూరు, నెల్లూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల తదితర జిల్లాల నుంచి 100 మంది మహిళలు ముగ్గుల పోటీలకు హాజరైనట్లు సంక్రాంతి సంబరాల కమిటీ అధ్యక్షుడు పొద శేషగిరిరావు తెలిపారు. రాష్ట్ర స్థాయి రంగవల్లుల పోటీల్లో చినగంజాం మండలం మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన నిదర మాదవి ప్రథమ బహుమతి రూ.55,555, చీరాలకు చెందిన వలంపట్ల సుప్రజ రెండవ బహుమతి రూ.25,555, గొనసపూడి గ్రామానికి చెందిన బొప్పన సురేఖకు రెండవ బహుమతి రూ.25,555లు, మూడవ బహుమతులను విజయవాడకు చెందిన ఏ.లత, పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన ఎ.కోటేశ్వరమ్మ, బూదవాడ గ్రామానికి చెందిన వి. వెంకట ఇందులకు ఒక్కొక్కరికి రూ. 10,555 నగదు బహుమతులను గ్రామ సర్పంచ్, విక్రం నారాయణరావు, టీడీపీ నాయకులు అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా టీడీపీ పర్చూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జరుబుల సంధ్యారాణి, మండల మహిళా అధ్యక్షురాలు కావూరి శారద, యద్దనపూడి మండల మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, పొద వెంకాయమ్మ, కందిమళ్ళ పూర్ణచంద్రరావులు వ్యవహరించారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కొండ్రగుంట శ్రీహరి బాబు, టీడీపీ జిల్లా కార్యదర్శి బత్తుల శ్రీనివాసరావు, విక్రం అజయ్‌బాబు, దివ్వకోలు రాము, నార్నే సత్యనారాయణ పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు

పర్చూరు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలం నాగులపాలెం గ్రామంలోని పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ముగ్గుల పోటీలకు స్పందన లభించింది. మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులను సుందరంగా తీర్చి దిద్దారు. గెలుపొందిన మహిళలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.15,116ను దమ్మాటి జానకి, రెండవ బహుమతి రూ.10,116లను బత్తుల కరుణ, మూడవ బహుమతి రూ.5,116ను కొల్లా శ్రీలక్ష్మి కైవసం చేసుకొని విజేతలుగా నిలిచారు. కన్సొలేషన్ బహుమతి ముద్దన శివ కుమారి దక్కించుకున్నారు.

శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ



అద్దంకి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం లక్ష తమలపాకుల పూజ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం నిర్వహించారు. అనంతరం అభిషేకం, అలంకరణ చేశారు. వేదపండితులు, పూజారులు 11 ఆవృత్తములుగా లక్ష తమలపాకులతో పూజ నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన న్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, యశోధ దంపతులు పాల్గొన్నారు. భోగి పండుగ, శివముక్కోటి కూడా కలిసి రావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఏర్పాట్లు ను ఈవో తిమ్మానాయుడు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి గ్రామోత్సవం

పంగులూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : చందలూరు గ్రామంలో మహాలక్ష్మీ అమ్మవారి కొలుపు మహోత్సవం భక్త సందోహంతో సందడిగా సాగుతోంది. సోమవారం అమ్మవారికి వేద పండితులు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లలిత సహస్ర నామార్చన, ఛండీ మూలమంత్ర అనుష్టానం, సప్త శతిపారాయణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఛండీ మూలమంత్ర జపంతో కలశంపై అమ్మవారి బింబంతో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం పంచసూక్త పారాయణం, లలిత సహస్ర నామార్చన, మహా నైవేద్యం, హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం జరిగింది. విద్యుత్ దీపాలంకరణతో నిర్మితమైన ప్రభ ఊరేగింపు ప్రతేక ఆకర్షణగా సాగగా, మహిళల కోలాట ప్రదర్శన అలరించింది. వేలాది మంది భక్తులతో గ్రామ పురవీధులలో జరిగిన అమ్మవారి గ్రామోత్సవం తిరునాళ్లను తలపించింది.

సహకారంపై కుస్తీ!

- సింగిల్ విండోలపై ముమ్మర కసరత్తు
- తప్పని అలకలు, అసంతృప్తులు
- నాలుగు రోజుల్లో జాబితాలు ఇవ్వాలని ఆదేశాలు
- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు బిజీబిజీ
- పండుగలకన్నా పదవులపైనే గ్రామ నేతల దృష్టి.

సొసైటీల పదవులపై అధికారపార్టీలో ముమ్మర కసరత్తు సాగుతోంది. గ్రామాల్లో ఒకపక్క సంక్రాంతి పండుగ హడావుడి నడుస్తుండగా సొసైటీల వారీ టీడీపీ ముఖ్య నేతలంతా ఈ అంశంపైనే దృష్టిపెట్టారు. కీలకమైన వాటిల్లో పోటీ పెరగటంతో ఆయా నియోజకవర్గాలోని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ఏకాభిప్రాయం కోసం కుస్తీపడుతున్నారు. ఎక్కువశాతం ఏకాభిప్రాయంతో జాబితా తయారు చేస్తున్నప్పటికీ పలు సొసైటీల విషయంలో కింది స్థాయి నాయకుల మధ్య పోటీ పెరిగి ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులకు తలనొప్పిగా మారింది. అలకలు, అసంతృప్తులు కూడా ఆరంభమయ్యాయి.



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రప్రభుత్వం సహకార వ్యవసాయ పరపతి సంఘాల(సొసైటీల)కు అనధికారిగా త్రీమెన్ కమిటీలను నియమించాలని నిర్ణయించింది. ఆ మేరకు ఒక్కక్క సొసైటీకి ఒక పర్సన్ ఇన్‌చార్జిగా ఒకరి పేరు, కమిటీ సభ్యులుగా ఇద్దరి పేర్లను ఎంపిక చేయాల్సి ఉంది. దీంతో అధికార టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులకు నియోజకవర్గాల పరిధిలోని సొసైటీలకు త్రీమెన్ కమిటీలను నియమించేందుకు అవసరమైన పేర్లు సూచించాలని అధిష్ఠానం ఆదేశాలు జారీచేసింది. 16 లేక 17 తేదీల కల్లా జాబితాలు పంపాలని కూడా ఆదేశించారు. దీంతో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు కిందిస్థాయి నాయకులకు సమాచారం ఇచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 174 సింగిల్ విండోలు ఉండగా వాటన్నింటికీ త్రీమెన్ కమిటీలు నియమించాల్సి ఉంది. జిల్లాలో పర్చూరు, అద్దంకి, ఎస్ఎన్‌పాడు, కొండపి, కందుకూరు, దర్శి నియోజకవర్గాల్లో ఎక్కువగా సింగిల్ విండోలు ఉన్నాయి. ఆ తర్వాత కనిగిరి, మార్కాపురం, వైపాలెం గిద్దలూరుల్లో కనీసంగా నాలుగు నుంచి ఎనిమిది వరకు సొసైటీలు ఉన్నాయి. అతి తక్కువగా ఒంగోలు నియోజకవర్గంలో మూడు మాత్రమే ఉన్నాయి. ఈ సొసైటీలకు త్రీమెన్ కమిటీలు నియమించిన తర్వాత సహకార కేంద్ర బ్యాంక్(డీసీసీబీ)కి కూడా పాలక మండలిని నియమించే అవకాశం ఉంది. దీంతో గత ఆరు నెలలుగా సెంట్రల్ బ్యాంకు అటు సొసైటీలపై ఉన్న అధికారుల పెత్తనం పోతుంది.

కీలక సొసైటీల్లో పోటీ

తాజా పరిస్థితిని పరిశీలిస్తే.. దాదాపు అన్నీ నియోజకవర్గాల్లో కీలక సొసైటీల పరిధిలో టీడీపీ నాయకులు పర్సన్ ఇన్‌చార్జి పదవి కోసం పోటీ పడుతున్నారు. అలాంటి చోట ఎవరిని ఎంపిక చేయాలనే విషయంలో ఎమ్మెల్యేలు కూడా ఇబ్బందిపడుతున్నారు. పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కొందరు కిందిస్థాయి నాయకులకు, కొందరు తమ వ్యక్తిగత సిబ్బందికి సొసైటీల వారీ నాయకులతో మాట్లాడే బాధ్యత అప్పగించారు. అయితే వారి మాట కూడా వినని పరిస్థితి ఉంది. దీంతో తీవ్ర పోటీ నెలకొన్న సొసైటీల విషయంలో ప్రత్యక్షంగా ఎమ్మెల్యేలే జోక్యం చేసుకోక తప్పటం లేదు. ఉదాహరణకు అత్యధికంగా 32 సింగిల్ విండోలు ఉన్న అద్దంకి నియోజకవర్గంలో రెండు సొసైటీల్లో నాయకుల మధ్య ఏర్పడిన తీవ్రమైన పోటీతో మంత్రి రవికుమార్ జోక్యం చేసుకోక తప్పలేదు. బల్లికురవ, వెల్లచెరువు పీఏసీఎస్‌ల పరిధిలో నాయకుల మధ్య ఏకాభిప్రాయం ఏర్పడలేదు. వెల్లలచెరువులో అయితే గ్రామంలో దేవాలయాల నిర్మాణానికి ఎవరు ఎక్కువ నిధులు ఇస్తే వారే పదవి తీసుకోవాలని ఒకవర్గం ప్రతిపాదించినట్లు తెలిసింది. మరో వర్గం వారు ఆ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారు. బల్లికురవ సొసైటీ పరిధిలో ఇద్దరు, ముగ్గురు నాయకుల మధ్య నెలకొన్న పోటీని కిందిస్థాయి నాయకులు నివారించలేకపోయారు. మంత్రి రవికుమార్ రెండు రోజుల్లో తానే తుది నిర్ణయం తీసుకుంటానని చెప్పినట్లు తెలిసింది.

ఏకాభిప్రాయం కోసం యత్నాలు

అదేస్థాయి సొసైటీలు ఉన్న పర్చూరు నియోజకవర్గంలో కూడా నాలుగు సొసైటీల్లో పోటీ తీవ్రంగా ఉంది. ఎమ్మెల్యే సాంబశివరావు ఏకాభిప్రాయం కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలో 20 సొసైటీలు ఉండగా చీమకుర్తి మండలంలో ఐదింటికి స్థానిక నాయకులతో మాట్లాడి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ జాబితాను సిద్ధం చేశారు. అయితే వారిలో పల్లామల్లి, కేపీపాలెం సొసైటీల పీఏసీ పదవులకు ఎమ్మెల్యే ఎంపిక చేసిన వారు తాము సిద్ధంగా లేమని చెప్పినట్లు తెలిసింది. చీమకుర్తి సింగిల్ విండోకు ఎమ్మెల్యే కూనాటి వెంకటరావు పేరు ఖరారు చేయగా మరో సీనియర్ నాయకులు హనుమంతరావు తనకే అవకాశం ఇవ్వాలని గట్టిగా పోటీలో ఉన్నారు. మద్దిపాడు మండలంలో నందిపాడు సొసైటీకి నాగేశ్వరరావు పేరు ఖరారుచేయగా దొడ్డవరం సొసైటీకి ముగ్గురు పోటీపడుతున్నారు. ఎస్ఎన్‌పాడులో పలు సొసైటీల్లో నాయకుల మధ్య పోటీ తీవ్రంగా ఉండటంతో అన్నిచోట్ల పదవులపై తానే నిర్ణయం తీసుకుంటానని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. దీనిపై మండల పార్టీ అధ్యక్షుడు మరికొందరు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. ఎన్‌జీపాడు మండలంలో ఆయా సొసైటీలకు ఇటు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అటు మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి అనుచరుల మధ్య పోటీ తీవ్రస్థాయికి చేరింది.

అక్కడక్కడా అలకలు

కొండపి నియోజకవర్గంలో 17 సొసైటీలు ఉండగా ఇటు మంత్రి స్వామి అటు మారిటైం బోర్డు చెర్మన్ సత్యాలు బిజీగా ఉండటంతో దామచర్ల పూర్ణచంద్రరావు అన్నీ సొసైటీలలో ఏకాభిప్రాయం కోసం కసరత్తు చేస్తున్నారు. చిరికూరపాడు సొసైటీకి ముగ్గురు నాయకులు పోటీపడటంతో తలనొప్పిగా మారినట్లు తెలిసింది. దీంతో పోటీపడుతున్న నాయకులంతా మంత్రి స్వామి మారిటైం చైర్మన్ సత్యల వద్ద తేల్చుకుంటామని వారి వద్దకు వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం. కందుకూరు నియోజకవర్గంలో ఏకాభిప్రాయ సాధన కోసం ఎమ్మెల్యే నాగేశ్వరరావు చేసిన ప్రయత్నాలు కొన్నిచోట్ల ఫలించలేదు. దీంతో ఎమ్మెల్యే ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ కొందరు లోకేష్‌కు ఫిర్యాదులు చేశారు.

దర్శిలో ప్రతిష్టాత్మకం

దర్శి నియోజకవర్గంలో 14 సొసైటీలు ఉండగా ఏకాభిప్రాయంతో ఎంపికలు పూర్తిచేసేందుకు ఇన్‌చార్జి లక్ష్మీ, ఆ పార్టీ నాయకులు లలిత్‌సాగర్ చర్చలు జరుపుతున్నారు. అయితే ఆరు సొసైటీల్లో నాయకులు మధ్య పోటీ నెలకొనగా నాలుగు సొసైటీల్లో నాయకులు రాజీకి ససేమిరా అనటంతో ప్రతిష్టాత్మకంగా మారింది. కనిగిరిలో ఎనిమిది సొసైటీల్లో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి ఒక్కటి మినహా మిగిలిన వారంతా మీరు చేసే ఎంపిక మాకు శిరోధార్యమని తేల్చిచెప్పారు. గిద్దలూరు నియోజకవర్గంలో తొమ్మిది సొసైటీల్లో మూడుచోట్ల నాయకుల మధ్య పోటీపెరగటంతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి నాయకులతో చర్చలు ప్రారంభించారు. మార్కాపురం నియోజకవర్గంలో ఈ విషయంపై సోమవారం దృష్టిపెడతానని ఎమ్మెల్యే నారాయణరెడ్డి చెప్పినట్లు తెలిసింది. వైపాలెం నియోజకవర్గంలో కొందరు నాయకులు నేరుగా అధిష్ఠానంను సంప్రదించగా ఇన్‌చార్జి ఎరీక్షన్‌బాబు చెబితేనే ఎంపికలు జరుగుతాయని చెప్పటంతో అతనిని వ్యతిరేకిస్తున్న నాయకులంతా తర్జనభర్జన పడుతున్నారు.

వైభవంగా భోగి


గొనసపూడిలో రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు


కారంచేడు భోగి వేడుకల్లో పాల్గొన్న మహిళలు

- వేకువజాము నుంచే ఇళ్ల ముందు మంటలు
- చిన్నారులు, యువత, వృద్ధుల సందడి
- రంగవల్లులతో వీధులు కళకళ

అద్దంకి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : భోగి పండుగను సోమవారం వైభవంగా జరుపుకున్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద సోమవారం వేకువజామున ఈవో తిమ్మానాయుడు, పూజారులు ఆధ్వర్యంలో సంప్రదాయ పూజలు నిర్వహించి భోగి మంటను వేశారు. అద్దంకి పట్టణంలోని హరిహర గోకులం వద్ద వాసవీవనితాక్లబ్ ఆధ్వర్యంలో భోగిని వైభవంగా నిర్వహించారు. భోగి మంటలతో పాటు చిన్నారులకు సంప్రదాయ దుస్తుల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతల గార్లపాటి శ్రీనివాసరావు, వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ జాయింట్ సె క్రటరీ వూటుకూరు ఉ మా అన్నపూర్ణ, రీజనల్ చైర్మన్ ఐతా శివనాగరాజు, ఆత్మకూరు ఆంజనేయులు, ఉడత్తు ఆదినారాయణ, చుండూరు గాయత్రి, రాఘవేంద్రరావు, గ్రంధి నాగరాజకుమారి, కొల్లిపర లావణ్య, లఘమారపు పద్మావతి, తాతా శిరీష తదితరులు పాల్గొన్నారు. అద్దంకి పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో హిందువులు తమ ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.

బల్లికురవ : భోగి పండగను సోమవారం ప్రజలు సందడిగా జరుపుకున్నారు. ఇళ్ల ముంగిట భోగి మంటలను వేశారు. వీర్ల గంగమ్మ ఆలయం వద్ద భక్తులు వేసిన ముగ్గు ఆకట్టుకుంది.

చినగంజాం : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని భోగి వేడుకలను మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పర్వదినం వేడుకలు సోమవారం భోగి మంటలతో ప్రారంభమయ్యాయి. వేకుమజాము నుంచే గ్రామాల్లోని పెద్దలు, యువకులు, చిన్నారులు, ప్రధాన రహదారిల్లోని కూడళ్లలో, ఇళ్ల ముందు ఆనందోత్సాహాలతో భోగి మంటలను వేశారు. మహిళలు ఇంటి ముందు రంగవల్లులు తీర్చిదిద్ది వాటిపై గొబ్బెమ్మలను ఉంచి పూలతో అలంకరించారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు, స్నేహితులు రాకతో పల్లెలోని లోగిళ్లన్ని కళకళలాడాయి. పలు గ్రామాల్లో వేకువజాము నుండే పండుగ వాతావరణం నెలకొంది. భోగి పండుగను పురస్కరించుకొని స్థానిక భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో చిన్నారులకు భోగి పండ్లను పోశారు.

మార్టూరు : మండలంలోని గ్రామాలలో భోగి పండుగ సందర్భంగా సోమవారం వేకువజామున వీధులలో భోగి మంటలతో సంక్రాంతి పండుగకు స్వాగతం పలికారు. పట్టణాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు సంక్రాంతి పండుగకు ఇళ్లకు చేరడంతో గ్రామాల్లో సందడి మొదలైంది. నేతాజీనగర్, తూర్పుబజారున, బలరాంకాలనీ, చౌదరి కాలనీ, విద్యానగర్ తదితర భోగిమంటలు వేశారు.


శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద భోగి మంట వేస్తున్న ఈవో తిమ్మానాయుడు, పూజారులు

సంక్రాంతి ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలి

మంత్రి రవికుమార్

అద్దంకి : సంక్రాంతి వేడుకలు ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగ వేళ తెలుగు లోగిళ్లు అలనాటి అనుభూతులకు వేదికలుగా మారతాయన్నారు. ప్రత్యేకించి గ్రామాలలో నెలకొనే సందడి అనిర్వచనీయం అన్నారు. ధాన్య సిరులు, సిరి సంపదలతో రైతులు జరుపుకునే సంక్రాంతి వేడుక గ్రామాలలో సంక్రాంతి శోభను ఇనుమడింప చేస్తాయన్నారు. రాష్ట్ర ప్రజలందరూ మకర సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని మంత్రి రవికుమార్ ఆకాంక్షించారు.

పంగులూరు : భోగి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం తెల్లవారుజామున భోగి మంటలు వేస్తూ సందడి చేశారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల చిన్నారులకు సంప్రదాయంగా రేగిపళ్లతో భోగి పళ్లు పోస్తూ ఘనంగా వేడుక నిర్వహించారు.

పర్చూరు : పర్చూరు మండలం, కారంచేడు గ్రామాల్లో భోగి పండుగ వేడుకలను ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. యువకులు, మహిళలు, వృద్ధుల సైతం ఉత్సాహంగా పాల్గొని ఆనందోత్సవాలు జరుపుకున్నారు.




అద్దంకిలోని హరిహర గోకులం వద్ద భోగి మంట వెలిగిస్తున్న టీడీపీ నేతల గార్లపాటి, వాసవీ వనితా క్లబ్ సభ్యులు, మార్టూరులో నేతాజీనగర్‌లో భోగి మంటల వద్ద యవతీ యువకులు, బల్లికురవ : గంగమ్మ ఆలయం ముందు వేసిన పెద్ద ముగ్గు

రేపటి నుంచి నాటికల పోటీలు



నాటికల ప్రదర్శనకు సిద్ధమవుతున్న వేదిక

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో బుధవారం రాత్రి స్వర్గీయ పెడవల్లి కామేశ్వరరావు కళా ప్రాంగణంలో ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ నాటిక పోటీలకు ముఖ్య అతిథిగా అమరావతి జేఏసీ కన్వీనర్ పువ్వాడ సుధాకర్ పాల్గొంటున్నారు. రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారు జనాబ్ మహమ్మద్ షరీఫ్‌కు కళాపరిషత్ సభ్యులు సన్మానం చేయనున్నారు. కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు ఆధ్వర్యంలో జరగనున్న ఈ పోటీల కోసం వేదికను సుందరంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాత్రి సమయాలలో మంచు కురుస్తున్నందువలన నాటిక పోటీలను తిలకించడానికి వచ్చే ప్రేక్షకులకు ఇబ్బందులు కలగకుండా షామియానాలను ఏర్పాటుచేస్తున్నారు. వరుసగా నాలుగురోజులు నాటికలను ప్రదర్శిస్తారు.

ప్రదర్శించే నాటికలు

బుధవారం రాత్రి సభాకార్యక్రమం అనంతరం మొదటిగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారిచే స్వేచ్ఛ నాటికను ప్రదర్శిస్తారు. తరువాత న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారిచే ఐ ఏట్ ఇండియా నాటికను, తర్వాత మూడవ నాటికగా శ్రీసద్గురు కళా నిలయం గుంటూరు వారిచే కమనీయం నాటికను ప్రదర్శిస్తారు.

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం

అద్దంకి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థాన అల్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అద్దంకిలోని భవానీ సెంటర్‌లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో నెల రోజుల నుంచి చిన్న జీయర్ స్వామి శిష్యురాలు స్వర్ణ అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న తిరుప్పావై ప్రవచనాలు సోమవారం ముగిసాయి. సోమవారం భోగి పండుగ సందర్భంగా గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో గుంటూరు నాగేశ్వరరావు, చల్లగుండ్ల సాయిబాబా దంపతులు, స్వర్ణ వెంకటసుబ్బారావు, పోతేపల్లి రాము, కొండముది బాపూజీ, సోడా వెంకటేశ్వర్లు, గుంటూరు జయమ్మ, చల్లగుండ్ల సుబ్బాయమ్మ, జయశ్రీ, కొండముది ఆంజనేయులు పాల్గొన్నారు.

ముగిసిన ధనుర్మాస ప్రత్యేక పూజలు

మార్టూరు : ధనుర్మాసం ముగింపుసందర్భంగా సోమవారం మండలంలోని ద్రోణాదుల గ్రామంలోని రామాలయంలో గోదారంగనాథ స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం అర్చకులు అళహరి పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు శాస్త్రయుక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి పెళ్లితంతును కనుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా, బొడ్డురాయి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి తాళిబొట్టును తీసుకువచ్చారు. తర్వాత వేదమంత్రాలు చదువుతుండగా స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించిన భక్తులు పరవశించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని ఇసుకదర్శి పాండురంగస్వామి దేవస్థానంలో గోదా కల్యాణాన్ని వేడుకగా నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు.


తిరుప్పావై ప్రవచనాలు చెప్తున్న చిన్నజీయర్ శిష్యురాలు స్వర్ణ అన్నపూర్ణ


పూర్ణసూర్యతేజాచారికి నగదు సాయం అందజేస్తున్న సుబ్బారావు మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు

ప్రతిభ చాటిన చందలూరు విద్యార్థులు

పంగులూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కొరిశపాడు మండలం రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రతిభ పోటీ పరీక్షలో చందలూరు పాఠశాల విద్యార్థులు నగదు బహుమతులు అందుకున్నారు. ఎలగాల సుబ్బారావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత నెలలో అద్దంకి, కొరిశపాడు, జె.పంగులూరు, ఇంకొల్లు, బల్లికురవ మండలాల పరిధిలో 10వ తరగతి విద్యార్థులకు గణితం, సైన్స్ పాఠ్యాంశాలలో పోటీ పరీక్ష నిర్వహించారు. ఈ పోటీలో 400ల మంది విద్యార్థులు పాల్గొనగా, చందలూరు పాఠశాల విద్యార్థులు టీసీ విభాగంలో కట్టా హారిక, ఎస్సీ విభాగంలో విప్పర్ల కల్పనలు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.10వేల నగదు పారితోషికం అందుకోగా, బీర్రా మణిదీపకరెడ్డి, చల్లా గాయత్రి, పతకమూరి పూర్ణ సూర్యతేజాచారిలకు కన్సొలేషన్ బహుమతిగా రూ.3వేల నగదు పారితోషికం లభించింది. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోపీచంద్ నేతృత్వంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పేద విద్యార్థి సూర్యతేజాచారిని ప్రోత్సహిస్తూ రూ.10 వేల ఆర్థిక సాయం అందచేశారని హెచ్‌ఎం గిరిజ తెలిపారు.

పేదలకు సాయంలోనే ఆనందం

చీరాలటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మానవత్వంతో నిరుపేదలకు సాయం చేయడంలో చెప్పలేని ఆనందం ఉందని పద్మ భాస్కర్ ఫౌండేషన్ ప్రతినిధి గంటా అనిల్‌కుమార్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చీరాల పట్టణ పరిధిలోని నిరుపేదలకు ఆయన నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. తన తల్లి పేరుమీద పేదలకు సాయం చేస్తున్నట్లు చెప్పారు.

పేకాట స్థావరంపై దాడులు.. పలువురి అరెస్ట్

చీరాలటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ హెచ్చరించారు. డీఎస్పీ ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో ఎస్సై నాగశ్రీను కొత్తపేటలోని ఓఇంట్లో దాడులు నిర్వహించారు. ఈనేపథ్యంలో పేకాట నిర్వహిస్తున్న ఎనిమిది మంది జూదరులను అరెస్ట్ చేశారు. అలాగే వారి వద్ద నుంచి రూ.4320 నగదును స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాలు, ఇతర జూదాలపై దాడులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వారం కిందట ప్రమాదం



పర్చూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కుమార్తెలు సజీవ దహనమైన ఘటన తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లి దాసరి రాజ్యలక్ష్మి (50)ఆదివారం రాత్రి మృతి చెందారు. స్థానిక తూర్పువారివీధిలో ఉంటున్న రాజ్యలక్ష్మి కుటుంబం ఈనెల 5 అర్ధరాత్రి ఇంట్లో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు కుమార్తెలు నాగమణి(34), మాధవీలత(30) మృతి చెందారు. మంటల్లో కాలిపోతున్న కుమార్తెలను రక్షించే క్రమంలో తీవ్రంగా గాయపడిన రాజ్యలక్ష్మిని గుంటూరుకు తరలించారు. ఇద్దరు కుమార్తెలు, భార్య మృతి చెందడంతో రాజ్యలక్ష్మి భర్త, మతిస్థిమితం లేని కుమారుడి పరిస్థితి దయనీయంగా మారింది. అమ్మ, అక్కా, చెల్లి మృతి చెందిన విషయం కూడా తెలియని పరిస్థితిలో ఆ యువకుడు ఉండడం అందరినీ కలచివేస్తోంది.

పండగపూట ఘోరం

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి
- హాస్పిటల్ వద్ద మిన్నంటిన బంధువుల రోదనలు


మనోహర్ జోష్

చీరాలటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పండుగపూట విద్యార్థి మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో ఓ కుటుంబం కుమారుడిని కోల్పోయింది. దీంతో తల్లిదండ్రులు, బంధువుల రోదన చీరాల ఏరియా హాస్పిటల్ వద్ద మిన్నంటింది. వివరాల్లోకి వెళితే .. చినగంజాం మండలం మోటుపల్లి పంచాయతీ నిరీక్షణగిరికు చెందిన పొన్నపూడి అబ్రహం మత్యకారుడు. ఇతనికి భార్య సుజాత, పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పెద్ద కుమారుడు మనోహర్ జోష్(15), ఏడవ తరగతి చదువుతున్న రత్నకుమార్ సంతానం. సంక్రాంతి పండుగ సందర్భంగా కఠారిపాలెంకు చెందిన పెదనాన్న సీతారామయ్య మరి కొందరు బంధువులతో కలిసి సోమవారం రాత్రి షాపింగ్‌కు రెండు ద్విచక్రవాహనాలపై కఠారిపాలెం నుంచి వేటపాలెం వెళుతున్నారు. మిగిలిన వారు మరో వవాహనంపై వెళుతుండగా మనోహర్, కొండూరి గోపయ్య ఒక బైక్‌పై వెళుతున్నారు. అయితే ఇంటి నుంచి బయలుదేరిని వీరి వాహనాన్ని పదినిముషాల వ్యవధిలోనే కఠారిపాలెం గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు వేగంగా ఢీకొన్నాడు. ఘటనలో మనోహర్ అక్కడికక్కడే మృతి చెందగా, గోపయ్యకు తీవ్ర గాయాలు కావడంతో ముందుగా చీరాల్లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టమార్టంకు తరలించారు. అయితే కుమారుడి మృతితో తల్లిదండ్రులు, బంధువుల హాస్పిటల్ వద్దకు చేరుకుని బోరున విలపించారు.

సంఘటితంతోనే సమస్యలకు పరిష్కారం

చీరాలటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంఘటితంగా పోరాడితేనే సమస్యలకు పరిష్కారం ఉంటుందని పలువురు మాదిగ సామాజిక వర్గం ప్రతినిధులు అన్నారు. సోమవారం చీరాల అంబేడ్కర్ భవన్‌లో ఆయా సామాజికవర్గం నాయకులు, ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. ముందుగా మాజీ పార్లమెంట్ సభ్యులు మంద జగన్నాథం మృతిపట్ల నివాళులర్పించారు. అనంతరం ఆయా కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మార్పీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

పూర్వ విద్యార్థుల సందడి

- వేర్వేరుచోట్ల కలిసిన స్నేహితులు
- గుర్తు చేసుకున్న పాత జ్ఞాపకాలు
- గురువులకు ఆత్మీయ సత్కారాలు

పంగులూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల ఆత్మీయ పలుకరింపులు, ఆటపాటలతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. మండలంలోని ముప్పవరం గ్రామ పీఎస్ఎస్‌సీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 1988వ టెన్త్ బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మూడున్నర దశాబ్దాల కిందట పాఠశాలలో ఆడిన ఆటలు, చేసిన అల్లరిని వారంతా గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా యోగ క్షేమాలు అడిగి పలుకరించుకున్నారు. తమ భవిష్యత్‌ను తీర్చిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకుంటూ గురువులను ఘనంగా సత్కరించారు. తమ ముందు ఆడుతూ పాడుతూ తిరిగిన పిల్లలు జీవితంలో స్థిరపడి ఇప్పుడు కుటుంబాలతో కనిపించడం పట్ల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మారుతి, వెంకారెడ్డి, రాజేంద్ర, శారద, విశ్రాంత హెచ్‌ఎంలు కృష్ణమూర్తి, క్రిష్ణయ్య, హెచ్‌ఎం ప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ముప్పవరం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విశ్రాంత హెచ్‌ఎం కృష్ణయ్యను సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు, ప్రతినిధులు

ఆత్మీయ కలయిక

బల్లికురవ : మండలంలోని కొమ్మినేనివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈసందర్భంగా అప్పట్లో పాఠశాలలో చదివిన 45 మంది విద్యార్థులంతా ఒక చోటుకి చేరి తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉన్నత చదువులతో ఉన్నతంగా ఎదిగినా పాఠశాలను తాము మరిచిపోమని వారు ఈసందర్భంగా తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. గతంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు పంచుమర్తి రామకృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వారణాసి జాన్సీలక్ష్మి, యర్రా పేరయ్య, మాదాల వెంకటేశ్వర్లు, షేక్ షబ్బీర్, తాడికొండ వీరకుమార్, పూర్వ విద్యార్థి డాక్టర్ దర్శి రమేష్‌బాబు, సర్పంచ్ యర్రా శాంతి, జడ్పీటీసీ సభ్యుడు అంజలి, ఎంపీటీసీ సభ్యుడు మిన్నెకంటి రామారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

30 ఏళ్ల తర్వాత

సంతమాగులూరు : సంతమాగులూరు మండలంలోని మక్కిన వారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990-94 సంవత్సరపు పూర్వ విద్యార్థుల కలయిక సోమవారం ఘనంగా జరిగింది. సంక్రాంతి పండుగ కోసం సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలతో బిజీబిజీగా ఉండేవారు కుటుంబాలతో గ్రామాలకు తరలివచ్చారు. ఇదే సరైన వేదికగా భావించిన పూర్వ విద్యార్థులంతా కలిశారు. వారంతా ఆదివారం పాఠశాలకు చేరుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకురించుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు. కార్యక్రమంలో తెలుగు, వ్యాయామ, గణిత ఉపాధ్యాయులు బాల సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, రంగా రెడ్డి సార్ విద్యార్థులు కరిముల్లా, గిరి,నాగేశ్వరరావు, షఫీలాల్ బుడే, శుభాని తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు రామకృష్ణ